విలేకరులు కావలెను
TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక




సంపుటి: 16 | సంచిక : 97 | మంగళవారం 04. 8. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00

## జెన్-జీ ఎప్పుడూ బీజేపీతోనే ఉన్నారు

- సమాజంలోని ప్రతి వర్గం మోదీకి అండగా నిలుస్తుందనే నమ్మకం ఉంది: పీయూశ్
- మోదీ దార్శనికతతో దేశాన్ని మాదక ద్రవ్య రహితంగా చేయడమే లక్ష్యం
- భారతదేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చాలనే మన యువత ఉత్సాహం వికసిత భారత్‌కు పునాది వేస్తుంది : పీయూశ్ గోయెల్ వెల్లడి



## బీజేపీలో ఎక్కువ మంది చందా దొంగలే



- ఆ విషయంలో బాధ్యతెందుకు వహించరు?
- శిలా పూజ నుంచి విరాళాల చోరీ మొదలైందని ఆరోపించిన కాంగ్రెస్
- బీజేపీ రామమందిరాన్ని నిర్మించలేదని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిర్మాణం జరిగిందని వ్యాఖ్యలు



## హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం

- రంగంలోకి దిగిన హైడ్రా, మాన్‌సూన్ టీమ్‌లు
- రాజధాని నగరంలో పలు ప్రాంతాల్లో కురిసిన వాన
- వర్షం కారణంగా రోడ్లపై నిలిచిన వరద నీరు
- ఆయా ప్రాంతాల్లో రంగంలోనికి దిగిన హైడ్రా
- వరద నీటిని తొలగించేలా చర్యలు

హైదరాబాద్ తెలంగాణ వాణి)

హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. నగరంలో ఉదయం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు సాయంత్రం వర్షం కురవడంతో సతమతమయ్యారు. నగరంలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట, ఎస్ఆర్‌నగర్, సనత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండలో వాన కురిసింది. యూసఫ్‌గూడ, కృష్ణానగర్, మధురానగర్, ముషీరాబాద్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్ ప్రాంతాల్లో - మిగతా3లో

# కనుమరుగు బాటలో బాపనకుంట ..!

- ఆక్రమణల కబంధ హస్తాల్లో నీటి వనరు...
- అధికారుల నిర్లక్ష్యంపై ఆరోపణలు
- నోటిఫైడ్ కుంట అయినా పట్టించుకోని వైనం..
- భవిష్యత్‌లో ఆనవాళ్లు మిగులుతాయా?




**సుజాతనగర్ ఆగస్టు 03 (తెలంగాణ వాణి)**

ఒకప్పుడు సాగునీటి ఆధారంగా, భూగర్భ జలాల పెంపునకు తోడ్పడిన బాపనకుంట ఇప్పుడు ఆక్రమణల కారణంగా తన ఉనికిని కోల్పోయే పరిస్థితికి చేరుకుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖ రికార్డుల్లో నోటిఫైడ్ కుంటగా నమోదై ఉన్నప్పటికీ.. కుంట భూములు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**నీటి వనరు కాస్తా వెంచర్‌గా మారుతోందా?**

వర్షపు నీటిని నిల్వ చేసుకుని పరిసర ప్రాంతాల వ్యవసాయానికి ఉపయోగపడే బాపనకుంట ప్రస్తుతం తన అసలు రూపాన్ని కోల్పోతుందని స్థానికులు చెబుతున్నారు. కుంట పరిధిలోని భూములు చదును చేయడం, హద్దులు మారిపోవడం, వెంచర్‌ల తరహాలో అభివృద్ధి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. తాజాగా నిర్మాణాలకు సన్నాహాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఇరిగేషన్ రికార్డుల్లో నోటిఫైడ్ కుంట**

బాపనకుంటకు సంబంధించిన తూముల నిర్మాణాలు ఇప్పటికీ కనిపిస్తున్నాయని, ఇది కుంట ఉనికికి ఆధారమని స్థానికులు పేర్కొంటున్నారు. మిషన్ కాకతీయలో భాగంగా కూడా కుంట అభివృద్ధి పనులు చేపట్టినట్లు సమాచారం. ఇలాంటి నీటి వనరులను కాపాడాల్సిన అధికారులు ఆక్రమణలపై చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**హద్దులు మాయమవుతున్నాయా?**

నోటిఫైడ్ కుంటల్లో నీరు లేని సమయంలో వ్యవసాయ అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ, కుంట స్వరూపాన్ని మార్చడం, శాశ్వత నిర్మాణాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని స్థానికులు అంటున్నారు. కుంట భూముల పరిరక్షణలో అధికారుల నిర్లక్ష్యం అనుమానాలకు తావిస్తోందని పేర్కొంటున్నారు.

**సమగ్ర సర్వేకు డిమాండ్**

బాపనకుంటకు సంబంధించిన పాత రెవెన్యూ, ఇరిగేషన్ రికార్డులను పరిశీలించి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. కుంట అసలు విస్తీర్ణం ఎంత? ప్రస్తుతం ఎంత భూమి మిగిలింది? ఎక్కడెక్కడ ఆక్రమణలు జరిగాయి? అనే విషయాలను అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు ఉంటే వెంటనే తొలగించి కుంట హద్దులను పునరుద్ధరించాలని కోరుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించకపోతే భవిష్యత్‌లో బాపనకుంట ఆనవాళ్లు కూడా కనిపించకుండా పోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## జంతర్ మంతర్ వేదికగా విధ్వంసానికి పాక్ ప్లాన్

- జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న హమిమ్ మండల్ అనే ఉగ్రవాద అనుమానితుడిని తూర్పు బర్ధమాన్ జిల్లాలో అరెస్ట్
- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇటీవల జరిగిన నిరసనల్లో పోలీసుల వేషధారణలో చొరబడి అల్లర్లు సృష్టించాలనేది ఈ ఉగ్రవాద కుట్ర ప్రధాన లక్ష్యం
- రాష్ట్ర ముఖ్యమంత్రి కదలికలపై నిఘా ఉంచాలని, రక్షణ లేని ప్రాంతాల వివరాలు సేకరించాలని పాకిస్థాన్ హ్యాండ్లర్లు హమిమ్‌ను ఆదేశించినట్లు వెల్లడి



## వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం

- వికసిత భారత్ సంకల్ప అభియాన్‌లో భాగంగా 'నశా ముక్త్ యువ' ప్రారంభం
- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ యువతకు ప్రధాని మోదీ పిలుపు
- 2047 నాటికి వికసిత భారత్ సాధనకు ఆరోగ్యవంతమైన యువత అవసరం



## రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు

- ఉత్తర తెలంగాణలో అతివృష్టి, దక్షిణాన అనావృష్టి!
- జులై ఆఖరి వారంలో ఊపిరి పీల్చుకున్న పలు జిల్లాలు
- కొన్ని జిల్లాల్లో ఇంకా తీవ్ర వర్షపాత లోటు
- జూన్, జులై నెలల్లో –5 శాతం లోటు

హైదరాబాద్ తెలంగాణ వాణి)

జులై నెల నాలుగో వారంలో అనూహ్యంగా ఏర్పడిన వాయుగుండం రాష్ట్ర వర్షపాత అంచనాలను తలకిందులు చేసింది. సుమారు 44 శాతానికి పైగా వర్షపాత లోటు ఉండొచ్చని వాతావరణ విశ్లేషకులు భావించగా, చివరికి దాదాపు సాధారణ పరిస్థితి (–1శాతం)కి చేరింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలు అన్నదాతల ఆశలకు ఊపిరి పోయగా, దక్షిణ జిల్లాల్లో మాత్రం ఇంకా లోటు తీవ్రత కొనసాగుతోంది. నైరుతి రుతుపవనాల్లో జూన్, జులై నెలలు కలిపి తెలంగాణ రాష్ట్రంలో –5 - మిగతా3లో

## వేలంలో పీకేఓసీ-2 దక్కడం సింగరేణి విజయం: భట్టి విక్రమార్క

**హైదరాబాద్ తెలంగాణ వాణి)**



మణుగూరు పీకేఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్ వేలంలో సింగరేణికి దక్కడం చారిత్రాత్మక విజయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన ఈ కేటాయింపుపై హర్షం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వ కృషితోనే నెల రోజుల వ్యవధిలో తాడిచర్ల-2, పీకేఓసీ-2 రూపంలో సింగరేణికి రెండు పెద్ద ప్రాజెక్టులు సొంతమయ్యాయని తెలిపారు. పీకేఓసీ-2 మైన్ ద్వారా ఏటా 6 మిలియన్ టన్నుల చొప్పున 20 ఏళ్ల పాటు 120 మిలియన్ టన్నుల జీ-8 నాణ్యమైన బొగ్గు అందుబాటులోకి వస్తుందని, దాదాపు 2,000 మందికి దీర్ఘకాలిక ఉపాధి భద్రతతో పాటు మణుగూరు ఏరియా మనుగడకు 20 ఏళ్ల భరోసా లభిస్తుందని వివరించారు. గతంలో ప్రైవేటు పరమైన కోయగూడెం-3, సత్తుపల్లి-3 బ్లాక్‌లను కూడా భవిష్యత్తులో సింగరేణికి దక్కేలా ప్రభుత్వం కృషి చేస్తుందని, రానున్న రోజుల్లో ఇతర రాష్ట్రాల్లో బొగ్గు గనులు, క్రిటికల్ మినరల్స్ అన్వేషణ దిశగా సింగరేణిని విస్తరింపజేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో సింగరేణి ప్రయోజనాల పరిరక్షణలో తగిన చొరవ చూపకపోవడం వల్ల కోయగూడెం-3 మరియు సత్తుపల్లి--3 వంటి కీలక బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్ సంస్థలకు వెళ్లిపోయాయని ఆయన విమర్శించారు. ప్రజా ప్రభుత్వం మాత్రం సింగరేణి ప్రయోజనాలనే కేంద్రబిందువుగా తీసుకుని ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుంటోందని స్పష్టం చేశారు. సీఎం ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేయడం, కొత్త బొగ్గు నిల్వలను సంస్థకు అందించడం, ఉద్యోగ భద్రతను పెంపొందించడం, తెలంగాణ విద్యుత్ అవసరాలకు దీర్ఘకాలికంగా బొగ్గు సరఫరా భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.



## ఈనెల 5న సీజేపీ కోర్ కమిటీ సమావేశం

- భవిష్యత్ కార్యాచరణపై చర్చ
- అభిజీత్ దీప్కే నివాసంలో సీజేపీ కోర్ కమిటీ భేటీ
- భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్న సీజేపీ కోర్ కమిటీ
- ఈ ఉద్యమాన్ని క్షేత్రస్థాయికి ఎలా తీసుకెళ్లాలి?
- విద్యార్థులపై నమోదైన కేసుల ఉపసంహరణ విషయమై కేంద్రంపై ఎలా ఒత్తిడి తీసుకురావాలనే అంశాలపై ప్రధానంగా చర్చించే అవకాశం

# సంక్షోభ కాలంలో విద్యారంగం

## ప్రొ.హరగోపాల్ ప్రసంగ వ్యాసాలు పుస్తకావిష్కరణ





ప్రముఖ విద్యావేత్త,పౌర హక్కుల నేత ప్రొ.జి.హర గోపాల్ గత నాలుగు దశాబ్దాలుగా దేశంలోని విద్యారంగం ఎదుర్కొంటున్న అనేక సంక్షోభాలపై చేసిన ప్రసంగాలను అక్షరీకరించి పాలమూరు అధ్యయన వేదిక ఒక పుస్తక రూపంలో తీసుకు రావడం అభినందనీయం... ప్రస్తుత పరిస్థితుల్లో ఆహ్వా నించదగ్గ అనివార్య అవస రం కూడా...నలభై ఏళ్లుగా దేశంలోని విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉద్య మిస్తున్న విద్యా పరిరక్షణ కమిటీలో కీలక పాత్రను నిర్వహిస్తున్న ప్రొ.హరగోపా ల్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరే షన్,డెమొక్రాటిక్ టీచర్స్ ఫెడరేషన్ లు ఆయా సంద ర్భాల్లో నిర్వహించిన విద్యా సభల్లో చేసిన నలభై మూ డు ప్రసంగాల సమాహారమే ఈ పుస్తకం.పాలమూరు ఆధ్యయన వేదిక తన అరవై ఐదవ ప్రచురణగా వెలువరించింది.ఈ పుస్తకం లోని అన్ని వ్యాసాల్లోనూ మనిషిని కేంద్రంగా చేసు కొని,మానవీయ సమాజం నిర్మాణం కోసం విద్య దోహ దపడాలన్న హరగోపాల్ తపన మనకు స్పష్టంగా కని పిస్తుంది.సమాజం వల్ల విద్యారంగం నష్టపోతుం దా..?,లేదా విద్యారంగం వల్ల సమాజం నష్టపోతుం దా..? అన్న అనేక ప్రశ్నలకు ఈ పుస్తకంలోని వ్యాసాల్లో హరగోపాల్ సూక్ష్మ పరిశీల నతో,సున్నితమైన స్పంద నల్లో ప్రకటించిన అభిప్రా యాల్లో మనకు నిర్దిష్టమైన సమాధానాలు లభిస్తాయి. సమాజ నిర్మాణంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన విద్యారంగాన్ని రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చిన పాలకులు ఎలా భ్రష్టుపట్టిస్తున్నారో కూడా ఈ వ్యాసాల్లో మనం చూడవచ్చు.అలాగే ఈ పుస్తకానికి “జీవితమంతా మంచికోసం,మానవత్వం కోసం తపించిన వ్యక్తి హరగోపాల్ నిరంతరం నదిలా ప్రవహించే మనిషి అని పేర్కొంటూ ఉపాధ్యా య ఉద్యమాల నేత,అధ్యా పక జ్వాల పత్రిక సంపాద కులు డాక్టర్ ఎం.గంగాధర్ రాసిన ఇరవై మూడు పేజీల ముందు మాట విద్యారంగం గురించి హరగోపాల్ ఆలోచ నలకు అద్దంపడుతుంది.

ఈ పుస్తకావిష్కరణ కార్యక్ర మాన్ని ఆదివారం నాడు హైదరాబాద్ లోని సుంద రయ్య విజ్ఞాన్ కేంద్రంలోని కాట్రగడ్డ శ్రీనివాసరావు హాల్లో తెలంగాణ డెమొక్రా టిక్ టీచర్స్ ఫెడరేషన్, పాలమూరు అధ్యయన వేదిక సంయుక్తంగా నిర్వ హించాయి.

ఈ కార్యక్రమానికి డెమొక్రా టిక్ టీచర్స్ ఫెడరేషన్ (డి.టి.ఎఫ్)రాష్ట్ర అధ్య క్షుడు ఎం.సోమయ్య,పాల మూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవాచారి అధ్యక్షవర్గంగా వ్యవహ రించారు.ఎం.వెంకట్రాములు స్వాగతం పలికారు.

ప్రొ.హరగోపాల్ కు సన్ని హిత మిత్రులైన ప్రొ.వి.ఎస్. ప్రసాద్ “సంక్షోభ కాలంలో విద్యారంగం”పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రధాన ప్రసం గం చేసారు.వందలాది మంది ఉపాధ్యాయ ఉద్యమకారులు,రచయితలు,సాహితీవేత్తలు,ఆలోచనాపరులు పాల్గొన్న ఈ సభలో ఎమ్మెల్సీ,ప్రొ.ఎం. కోదండరాం,ప్రొ.కే.చక్రధర్ రావు,ప్రొ.కే.లక్ష్మీనారా యణ,హరగోపాల్ సహచరి డాక్టర్ ఎం.వనమాల,అధ్యా పక జ్వాల సంపాదకులు డాక్టర్ ఎం.గంగాధర్, డిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి, రాజేంద్రబాబు అర్విని, సి.హెచ్.అనిల్ కుమార్, పి.బి.స్వామి తదితరులు ప్రసంగించారు.

ప్రొ.హరగోపాల్ విద్యారం గంపై చేసిన ప్రసంగాల్లో కానీ,రాసిన వ్యాసాల్లో కానీ సోక్రటీస్ దృక్పథాన్ని అనుస రించాడని,సోక్రటీస్ దృక్ప ధమంటే ప్రశ్నించడం, నిజాలను చెప్పడం,నిజా లను నిర్భయంగా ప్రకటించే క్రమంలో త్యాగాలకు సిద్ధప డటమేనని పలువురు వక్తలు పేర్కొన్నారు.

విద్య అంటేనే ప్రశ్నించడం, జ్ఞానం అంటేనే ప్రశ్నించడం, కొత్త జ్ఞానం రావాలంటే ప్రశ్నించడం ద్వారానే వస్తుందని,ప్రశ్నించకుండా మానవ అభివృద్ధి జరగదని తాను విశ్వసించి,అదే పనిగా హరగోపాల్ తన 83 ఏళ్ల వయస్సులోకూడా నిరంతరం తన ఉద్యమ జీవితాన్ని ఆచరణలో పెడుతూ,భవిష్యత్ తరాలను ప్రభావితం చేస్తు న్నాడని వక్తలు అభిప్రా యపడ్డారు.దేశంలోని విద్యారంగంలో చేపట్టవ లసిన సంస్కరణల కోసం 1966 లో ఏర్పాటు చేసిన కొఠారి కమిషన్ రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ,వాటి సంరక్షణ కోసం అనేక సిఫారసులు చేసిందని, అందులో “కామన్ స్కూల్ విధానం”అతి ప్రధానమైంద ని,కామన్ స్కూల్ విధానా న్ని అమలు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫల మయ్యాయని వక్తలు తమ ఆందోళనను వ్యక్తం చేసారు.

1980 తర్వాత ఆయా ప్రభుత్వాలు విద్యావ్యవస్థ లో మార్పు కోసం ఏర్పాటు చేసిన కమీషన్లన్నీ రాజ్యాం గ విలువలకు తిలోదకాలు ఇచ్చాయని వారు విమర్శిం చారు.విద్యారంగాన్ని పాల కులు నిర్లక్ష్యం చేయడం మూలంగానే ప్రభుత్వ రంగ విద్యావ్యవస్థ కనుమరుగై పోయే ప్రమాదం ఏర్పడిం దని,ఇదే దశలో ప్రైవేట్ విద్యారంగం విజృంభించి విస్తరించడం మూలంగానే సామాన్యులు విద్యకు దూరం కావలసివస్తుందని వక్తలు ఆవేదన వ్యక్తం చేసారు.ఫలితంగా అన్ని రంగాల్లో అవినీతి,అసమా నతలు పెరిగిపోయాయని వారన్నారు.ప్రశ్నించడాన్ని పాలకులు నేరంగా భావించ డం వల్లనే సమాజం అన్ని రంగాల్లో సంక్షోభాన్ని ఎదు ర్కొంటుందని,సంక్షోభాలను ఎదుర్కొనే క్రమంలోనే దేశంలో అనేక ఉద్యమాలు కొనసాగుతున్నాయని,అందులో భాగంగానే రైతు ఉద్యమాలు ఉవ్వెత్తున లేశాయని,మొన్నటి జంతర్ మంతర్ లో జరిగిన విద్యా ర్థుల ఉద్యమం కూడా అందుకు తాజా తార్కాణ మని వక్తలు పేర్కొన్నారు.

సమాజం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు హరగోపాల్ వ్యాసాలు పరిష్కారం చూపుతాయని వారు అభిప్రాయపడ్డారు.అంతకు ముందు రచయిత ఇక్బాల్ పాషా కథల సంపుటి”నల్ల రేగళ్లు “పుస్తకాన్ని డాక్టర్ ఎం.గంగాధర్ ఆవిష్కరిం చారు.చివరగా ప్రొ.హర గోపాల్ చేసిన ప్రసంగంతో మూడున్నర గంటల పాటు జరిగిన సమావేశం ముగి సింది.

ఈ సమావేశంలో పాల్గొన్న నేను హుజూరాబాద్ జనసాహితి ప్రచురణగా వెలువడిన విప్లవ రచయిత వరవర రావు రాసిన”ఈ తలారి వ్యవస్థను రద్దు చేద్దాం “ పుస్తకాన్ని ప్రొఫెసర్లు హరగోపాల్, వి.ఎస్.ప్రసాద్,చక్రధర్ రావు,లక్ష్మీనారాయణలకు అందించడం జరిగింది.

డి.టి.ఎఫ్.రాష్ట్ర కార్యదర్శి అటుకుల శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి,ఆ సంస్థ రాష్ట్ర కమిటీ మాజీ అధ్య క్షులు ఎం.రఘుశంకర్ రెడ్డి,నారాయణ రెడ్డిలతో నేను కొద్ది సేపు మాట్లాడటం జరిగింది.

- ఆవునూరి సమ్మయ్య

ఇండిపెండెంట్ జర్నలిస్ట్

# ఎన్యూమరేషన్ దరఖాస్తుల స్వీకరణపై నిరంతర పర్యవేక్షణ అవసరం: ఎమ్మెల్యే వంశీకృష్ణ

**అచ్చంపేట, ఆగస్టు 03 (తెలంగాణ వాణి):**



ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఆగస్టు 10 వరకు ఎన్యూమరేషన్ దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని, బీఎల్ఏలు, పర్యవేక్షకులు నిరంతరం పర్యవేక్షించాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సూచించారు.ఆన్లైన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్ల వివరాలను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# మణుగూరు డిప్ సైడ్ 2 బొగ్గు బ్లాక్‌ను బిడ్‌లో దక్కించుకున్న సింగరేణి

## ఐఎన్టియుసి పోరాట ఫలితమే కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్

**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 3 (తెలంగాణ వాణి)**

ఐఎన్టీయూసీ పోరాటాల ఫలితంగానే మణుగూరు డిప్ సైడ్ 2 బ్లాక్ ను సింగరేణి సంస్థ సొంతం చేసుకోవడం జరిగిందని ఐఎన్టియుసి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ పేర్కొన్నారు. అయితే యూనియన్ సెక్రటరీ జనరల్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ ఆదేశానుసారం అన్ని ఏరియా జీఎం ఆఫీస్లలలో కొత్తగూడెం ఏరియా ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో జీఎం ఆఫీస్ ముందు మహా ధర్నా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. అయితే ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఐఎన్టీయూసీ సెంట్రల్, బ్రాంచ్ నాయకులు, ఫిట్ కార్యదర్శులు, ఇన్చార్జులు, ఉద్యోగులు, మహిళ ఉద్యోగులు,డిఎల్ఆర్ కార్మికులు, సహకరించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ సింగరేణి మరియు రాష్ట్ర ప్రభుత్వాన్ని సమన్వయ పరిచి మణుగూరు డిప్ సైట్ 2 బొగ్గు బ్లాక్ సింగరేణి కే వచ్చే విధంగా కృషిచేసిన ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్ డా: బి.జనక్ ప్రసాద్, ఐఎన్టియుసి నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు.మణుగూరు ప్రాంతం అభివృద్ధి చెందాలంటే సింగరేణి మరింత బలోపేతం కావాలన్నా సింగరేణి బలంగా ఉంటే స్థానిక వ్యాపారాలు బలపడతాయన్నారు. వ్యాపారాలు అభివృద్ధి చెందితే ఉపాధి పెరుగుతుందన్నారు. ఓసీ-2 డీప్ సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కడం అనేది మణుగూరు భవిష్యత్తును మరింత స్థిరంగా నిలబెట్టే నిర్ణయంగా చెప్పవచ్చునని పేర్కొన్నారు. ఈ విజయాన్ని ఇక్కడితో ముగిసిన ప్రక్రియగా కాకుండా, అభివృద్ధికి ఆరంభంగా చూడాలన్నారు. గని అభివృద్ధి పనులు వేగంగా ప్రారంభం కావడం, స్థానికులకు ప్రాధాన్యంతో ఉద్యోగాలు కల్పించడం, పర్యావరణ పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవడం, నిర్వాసితుల సమస్యలను న్యాయంగా పరిష్కరించడం వంటివి చేయాలన్నారు. కార్మిక సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై కూడా సమాన దృష్టి అవసరమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం, సంబంధిత శాఖలు, నిర్ణయ ప్రక్రియలో భాగమైన అధికారులు, సింగరేణి యాజమాన్యం ఈ అంశంపై నిరంతరం స్వరం వినిపించిన ఐఎన్టియుసి కార్మిక సంఘాశీ, ప్రజా సంఘాలు, వ్యాపార వర్గాలు, ప్రజాప్రతినిధులు, మణుగూరు ప్రజలందరూ అభినందనలను తెలిపారు. ఓసీ-2 డీప్ సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కడం ఒక పరిపాలనా నిర్ణయం మాత్రమే కాదని, మణుగూరు భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంచిన నిర్ణయమన్నారు.ఈ అవకాశాన్ని సమర్థంగా వినియోగించుకుంటే మణుగూరు ప్రాంతం మరోసారి పారిశ్రామిక అభివృద్ధికి కేంద్రబిందువుగా నిలిచే అవకాశం ఉందని ఈ సందర్భంగా వారు హర్షం వ్యక్తం చేశారు. అలాగే నాయకులు కార్యకర్తలు మహిళ ఉద్యోగులు, డిఎల్ఆర్ కార్మికులకు, ప్రతి ఒక్కరికి పేరుపేరునా శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఎస్కేప్‌ను పునరుద్ధరించాలని నీటిపారుదల మంత్రికి రైతుల వినతి



**తల్లాడ, ఆగస్టు 03 (తెలంగాణ వాణి):**

అన్నారుగూడెం--గోపాలపేట గ్రామాల మధ్య తొలగించిన ఎస్కేప్‌ను యథావిధిగా పునరుద్ధరించాలని ఆయా గ్రామాల రైతులు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఎస్కేప్ తొలగింపుతో సుమారు 2 వేల ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రైతులు తెలిపారు. ఎస్కేప్‌ను తిరిగి ఏర్పాటు చేసి పంటలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నారుగూడెం గ్రామ రైతులు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, శ్రీనివాసరావు, అన్నారుగూడెం మాజీ విడిసి చైర్మన్ మారెళ్ళ మల్లికార్జునరావు, అన్నారుగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మలపల్లి రమేష్, ఎల్లంకి వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్, నున్నా పెద్ద తిరుమలయ్య, కొత్త వెంకటగిరి సర్పంచ్ దీవెల వెంకటేశ్వరరావు, బిల్లుపాడు రైతులు రామప్పారావు జక్కంపూడి రమేష్, అంజనాపురం రైతులు కొమ్మినేని వెంకటేశ్వర్లు బండారుపల్లి రాము, బండారుపల్లి వెంకటేశ్వర్లు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# మోగరాలగుప్ప పాఠశాలలో ఘనంగా బోనాల సంబరాలు

**ములకలపల్లి, ఆగస్టు 03 (తెలంగాణ వాణి):**

ములకలపల్లి మండలం మోగరాలగుప్ప ప్రాథమిక పాఠశాలలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి, బోనాలు సమర్పించి, దేవతా వేషధారణతో ఆకట్టుకున్నారు. బోనాల పండుగ ద్వారా చిన్నారులకు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కలుగుతుందని సర్పంచ్ తెలిపారు. పాఠశాల అభివృద్ధికి పంచాయతీ తరఫున సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాలప్రధానోపాధ్యాయురాలు స్వరూప భవాని ఉపాధ్యా యులు బాబూలాల్ అంగన్వా డీ టీచర్స్ రమాదేవి,వసంత విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు





# ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించిన నిషాని రామచంద్రం

**వరంగల్:ఆగస్టు 03 (తెలంగాణ వాణి)**

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణిం చిన బహుజన్ సమాజ్ పార్టీ హుస్నాబాద్ అసెంబ్లీ సైదాపూర్ మండలానికి చెందిన కొయ్యేడ మధు యొక్క కూతురు అక్షర (8సంవత్సరాలు)అదే రోడ్ ప్రమాదంలో గాయపడి కుడి చేయి కుడి కాలు విరిగి వరంగల్ లో ఎంజిఎం ఆసు పత్రి లో చికిత్స పొందుతు న్న పాప ను బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జి అడ్వకేట్ నిషాని రామ చంద్రం సోమ వారం హుస్నాబాద్ అసెంబ్లీ నాయకులతో కలసి పరామ ర్శించారు.ఎంజిఎం ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి మెరు గైన వైద్యం అందించాలని కోరారు.ఒక శస్త్ర చికిత్స ఆపరేషన్ పూర్తయింది. ఇంకో ఆపరేషన్ ఉన్నందున ఎవరైన రక్షిత రక్త దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జోన్ ఇంచార్జ్ దొడ్డే సమ్మయ్య,అసెంబ్లీ అధ్యక్షులు వేల్పుల రాజు, అసెంబ్లీ నాయకులు జేరిపోతుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం, ఆగస్టు 03 (తెలంగాణ వాణి):**

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి తక్షణమే పరిష్క రించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వృద్ధాప్య పెన్షన్, తలసేమియా బాధిత చిన్నారికి ఆర్థిక సాయం, భూమికి రహదారి సౌకర్యం, దివ్యాంగుడికి ఉపాధి కల్పన వంటి సమస్యలపై వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి,జెడ్పీ సిఈఓ దీక్షా రైనా,జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, ప్రజలు,తదితరులు పాల్గొన్నారు

# తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి: కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం, ఆగస్టు 03 (తెలంగాణ వాణి):**

ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను అదనపు కలెక్టర్లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిశువు పుట్టిన తర్వాత మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలే సంపూర్ణ ఆహారమని, తల్లిపాల ప్రాధాన్యంపై గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్,డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా,జిల్లా మహిళా,శిశు సంక్షేమ శాఖ అధికారి ఎ. ప్రమీల,జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు,జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్,పోషణ్ అభియాన్ సిబ్బంది,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు...




# మత్తు పదార్థాలపై యువతకు అవగాహన కల్పించాలి: అదనపు కలెక్టర్ మహేందర్

**ములుగు, ఆగస్టు 03 (తెలంగాణ వాణి):**

మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన డ్రగ్స్ నియంత్రణపై సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్ దెబ్బతింటుందని, పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అధికారులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. మత్తు పదార్థాల సమాచారం ఉంటే 1908 టోల్ ఫ్రీ నంబర్ లేదా 8712671111కు సమాచారం అందించాలని తెలిపారు.



# తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి: కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం, ఆగస్టు 03 (తెలంగాణ వాణి):**

ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిశువు పుట్టిన తర్వాత మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలే సంపూర్ణ ఆహారమని, తల్లిపాల ప్రాధాన్యంపై గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి శిశువుకు తల్లిపాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా రూపకల్పనలో పారదర్శకత పాటించాలి: సీఈఓ సుదర్శన్ రెడ్డి




**ములుగు, ఆగస్టు 03 (తెలంగాణ వాణి):**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్--2026)లో భాగంగా ఓటరు జాబితా రూపకల్పనను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాల్లో వివరాలు పూర్తిగా నమోదు చేయాలని, బీఎల్‌వోల సంతకాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని సూచించారు. మారిన, మరణించిన, గుర్తించలేని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, పెండింగ్‌లో ఉన్న ఓటర్ల మ్యాపింగ్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు.పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. సమావేశంలో ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు పాల్గొన్నారు.

# వగ్గు ఎల్లయ్య కుటుంబానికి ఆర్థిక సాయం



**అచ్చంపేట, ఆగస్టు 02 (తెలంగాణ వాణి):**

మన్నెవారిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వగ్గు ఎల్లయ్య ఇటీవల మృతి చెందడంతో, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు నాయకులు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట మాజీ ఎంపీపీ రామనాథం, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు సుంకరి కృష్ణయ్య గౌడ్, మాజీ సర్పంచ్ నిరంజన్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండీ షాబొద్దీన్, వరికుప్పల సిద్ధయ్య, దస్తగిరి, రాములు, యాదయ్య, కడారి అంజి, ఎర్గదిండ్ల అంజి తదితరులు పాల్గొన్నారు.

# రేగళ్ల--కరకవాగు రహదారి పనుల్లో నాణ్యత పాటించాలి: కలెక్టర్‌కు సర్పంచ్ వినతి

**కొత్తగూడెం, ఆగస్టు 03 (తెలంగాణ వాణి)**

రేగళ్ల--కరకవాగు రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రేగళ్లపాడు (పెద్దతండా) గ్రామ సర్పంచ్ లావుడ్య పూర్ణ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. రహదారి షోల్డర్ల నిర్మాణంలో నాణ్యతలేని చెరువు మట్టిని వినియోగిస్తున్నారని పేర్కొంటూ, సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాధనంతో నిర్మిస్తున్న రహదారుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని విజ్ఞప్తి చేశారు.



## పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**అదనపు కలెక్టర్ వి. భుజంగరావు**



**నిజామాబాద్, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ వి. భుజంగరావు అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేదిక, సీటింగ్, భద్రత, ప్రోటోకాల్ ఏర్పాట్లతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతిబింబించే శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులతో దేశభక్తి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరై వేడుకల విజయవంతానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ సన్నాహక సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, జెడ్పి సీఈఓ సాయాగౌడ్, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,. డీఆర్డీఓ సాయన్న, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ త్వరగా పూర్తి చేయాలి

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి**




**నిర్మల్, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను త్వరితగతిన, పూర్తిస్థాయి పారదర్శకతతో పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డిజిటలైజేషన్‌లో ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలని సూచించారు. అలాగే ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్‌కు చెందిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టురట్టు

- **పోలీసుల అదుపులో ఇద్దరు బంగ్లాదేశ్ వాసులు, ఒక భారతీయుడు**
- **ఎస్పీ అఖిల్ మహాజన్**



**ఆదిలాబాద్, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
మావల పోలీస్ స్టేషన్ పరిధిలో కైలాష్‌నగర్‌లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించి, అంతర్జాతీయ--అంతర్రాష్ట్ర చోరీ ముఠాకు చెందిన ఇద్దరు బంగ్లాదేశ్ పౌరులు, ఒక భారతీయుడిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ప్రధాన నిందితుడు మొహమ్మద్ జౌనీ అలీ గత తొమ్మిదేళ్లుగా పలు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతూ, అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించి నకిలీ ఆధార్ కార్డు పొందినట్లు దర్యాప్తులో వెల్లడైందన్నారు. ఇటీవల బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చి తన సహచరులతో కలిసి ఆదిలాబాద్‌లో చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

## ప్రజావాణికి 121 ఫిర్యాదులు



**నిజామాబాద్, ఆగస్టు 03 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 121 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. సహేతుక వివరణలతో కూడిన వివరాలను వెంటదివెంట ఆన్ లైన్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పు జర్నలిస్టుల హక్కుల పరిరక్షణలో మైలురాయి

**టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బి. మల్లేష్**

**నర్సంపేట, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**



జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)కు ప్రాతినిధ్యం కల్పించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు జర్నలిస్టుల హక్కుల పరిరక్షణలో చారిత్రాత్మక మైలురాయని టీడబ్ల్యూజేఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బి. మల్లేష్ అన్నారు. ఈ విజయానికి కృషి చేసిన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్యతో పాటు న్యాయవాదులు, రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ తీర్పుతో జర్నలిస్టుల సమస్యలను మరింత సమర్థవంతంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే అవకాశం లభించిందన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సేవలు చిరస్మరణీయం

**పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన గరికపాటి మోహన్‌రావు**

**నర్సంపేట, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులను మాజీ రాజ్యసభ సభ్యులు, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు గరికపాటి మోహన్‌రావు సోమవారం వారి నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, ఆయన మరణం నర్సంపేట నియోజకవర్గంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలకు తీరని లోటని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేసిన ప్రజానాయ కుడిగా ఆయన చిరస్థాయిగా గుర్తుండిపోతారని పేర్కొన్నారు. రాజకీయాలు వేర్వేరు అయినా ప్రజాసేవే ప్రతి నాయకుడి ధ్యేయమని, పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని కొనియాడారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో



బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, ఎన్ఎస్ఆర్ అధినేత సంపత్‌రావు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పెద్ది సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించి, పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఉద్యోగులు తప్పనిసరిగా ముఖ గుర్తింపు హాజరు నమోదు చేయడంతో పాటు మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ విద్యాసంస్థలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు,



కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలి

**డీఎంహెచ్ఓ డా. మధుసూదన్**

**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితానికి బాటలు పడతాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మధుసూదన్ తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తల్లిపాలు శిశువుకు అవసరమైన పోషకాలు, రోగనిరోధక శక్తిని అందించి ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తాయని, గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాజేంద్ర ప్రసాద్, పీడియాట్రిక్స్ విభాగాధిపతి డా. సురేందర్,



గైనకాలజీ విభాగాధిపతి డా. కవిత, బీడబ్ల్యూఓ శ్రీమతి మల్లేశ్వరి,ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగరాణివైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు మరియు బాలింతలు పాల్గొన్నారు.

## కాకతీయ వైభవానికి కేంద్రం పెద్దపీట వేయాలి

**వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య**

**హనుమకొండ, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
కాకతీయ వారసత్వ పరిరక్షణ, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య లోక్‌సభలో డిమాండ్ చేశారు. వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి, చేనేత, హస్తకళలు, సాంస్కృతిక వారసత్వ అభివృద్ధికి చేపట్టిన



చర్యలపై కేంద్రాన్ని ప్రశ్నించారు. దీనికి స్పందించిన కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, ఏఎస్ఐ ఆధ్వర్యంలో కాకతీయ కట్టడాల పరిరక్షణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కాకతీయ వారసత్వ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ప్రపంచ స్థాయి పర్యాటక సదుపాయాలు కల్పించాలని ఎంపీ కావ్య కోరారు.

## రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనర్‌గా డాక్టర్ షేక్ జాన్ పాషా ఎంపిక

**చిలుకూరు, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాశాఖ నిర్వహిస్తున్న నూతన పాఠ్యపుస్తకాల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌లో చిలుకూరు మండలానికి చెందిన డాక్టర్ షేక్ జాన్ పాషా రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనర్‌గా ఎంపికయ్యారు. 2026--27 విద్యా సంవత్సరానికి ప్రవేశపెట్టిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం అర్థశాస్త్ర పాఠ్యపుస్తకాలపై అధ్యాపకులకు శిక్షణ అందించనున్నారు. ఆయన ఎంపికతో కళాశాల, చిలుకూరు మండలానికి గౌరవం దక్కిందని, పలువురు ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.




## దళిత హామీలు అమలు చేయాలి

**కలెక్టరేట్ ఎదుట డిహెచ్పిఎస్ ధర్నా**

**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన దళిత హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్పిఎస్) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల ఆర్థిక సహాయం, చేవెళ్ల డిక్లరేషన్ అమలు, పోడు భూములకు పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లలో దళితులకు న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరిస్తూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిహెచ్పిఎస్




కార్యదర్శి పొనగంటి లావణ్య ,జిల్లా అధ్యక్షులు రాసపల్లి భద్రయ్య, ఉపాధ్యాయులు మంచినీళ్ల వైకుంఠం, లక్ష్మయ్య, సమ్మక్క, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
ప్రజావాణిలో వచ్చిన అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి, పెండింగ్ దరఖాస్తులను వచ్చే వారంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 81 వినతులు స్వీకరించి, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే గత వారం నుంచి పెండింగ్‌లో ఉన్న 144 ప్రజావాణి అర్జీలు, సీఎం ప్రజావాణికి సంబంధించిన 47 దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్ఓ వసంత



కుమారి, ఆర్డిఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ వెంటనే పూర్తి చేయాలి

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి**




**ఆదిలాబాద్, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో డిజిటలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుండి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆర్.ఎస్.చిత్రు, డిఆర్ఓ స్రవంతి, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## ప్రజా ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడం అధికారుల బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఉపాధి హామీ, భూభారతి తదితర అంశాలకు సంబంధించిన 109 ఫిర్యాదులను స్వీకరించి, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను 30 రోజుల్లోగా పరిష్కరించి, శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని సూచించారు.

## వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యంపై కఠిన చర్యలు

**అదనపు కలెక్టర్ వి. భుజంగరావు**



**నిజామాబాద్, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ వి. భుజంగరావు హెచ్చరించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, నాసిరకం ఆహార పదార్థాలు సరఫరా చేసే కాంట్రాక్ట్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు అధికారులు విద్యాసంస్థలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. సమీక్షా సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఈ.ఓ అశోక్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

## ముధోల్ యువతకు ఉచిత పోలీస్ కోచింగ్ ప్రారంభం



**నిర్మల్--భైంసా, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
ముధోల్ నియోజకవర్గ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు తోడ్పాటుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ప్రజా ట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్‌రావు పటేల్ ఆధ్వర్యంలో ఉచిత పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ కోచింగ్ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతకు నాణ్యమైన శిక్షణతో పాటు ఉచిత మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. గతంలో ప్రజా ట్రస్ట్ నిర్వహించిన ఉచిత కోచింగ్ ద్వారా 15 మంది యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని, ఈసారి మరింత మందిని ఉద్యోగాలకు సిద్ధం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్,రామకృష్ణ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, ప్రజా ట్రస్ట్ ప్రతినిధులు,అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## ఇంద్రేశం మున్సిపాలిటీలో బీజేపీ కార్యవర్గ సమావేశం

### నూతన బాధ్యుల నియామకం



**పటాన్‌చెరు, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం మున్సిపాలిటీలో బీజేపీ కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని, కార్యకర్తలు ప్రజలకు చేరువ కావాలని పిలుపునిచ్చారు. శంషాబాద్ రాజు బూత్ స్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఇంద్రేశం మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడిగా బేగారి శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా సుధీర్‌రెడ్డిని నియమించినట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, సర్ కోఆర్డినేటర్, 3వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి ప్రియాంక హర్షవర్ధన్ రెడ్డి, 16వ వార్డు కౌన్సిలర్ కిరాటాల లక్ష్మి జంగయ్య, సీనియర్ నాయకులు ధనంజయ్, కంజర్ల రాజు, బచ్చుగూడెం మల్లేష్, శివరెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

## మాదిగ జాతీయ మహాసభను విజయవంతం చేద్దాం

### సందే కార్తీక్ మాదిగ పిలుపు



**వనపర్తి, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
సెప్టెంబర్ 8న హైదరాబాద్‌లో జరిగే మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభను విజయవంతం చేయాలని, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎంఎస్‌ఎఫ్ నూతన కమిటీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎంఎస్‌ఎఫ్ ఉమ్మడి మహబూబ్‌నగర్--నల్గొండ జిల్లాల ఇన్‌చార్జి సందే కార్తీక్ మాదిగ పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం కోసం ఉద్యమాన్ని బలోపేతం చేయాలని, ప్రతి కళాశాలలో ఎంఎస్‌ఎఫ్ కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థులను ఉద్యమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా ఇంచార్జ్ కొమువారి మస్తాన్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కొమ్ము చిన్నకేశవులు మాదిగ, గంధం గట్టయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మీసాల నాగరాజు మాదిగ, మీసాల గణేష్ మాదిగ (వనపర్తి జిల్లా కో-ఇంచార్జ్), గద్వాల్ జిల్లా ఎంఎస్‌ఎఫ్ నాయకులు కోళ్ల మహేష్ మాదిగ, దేవరాజు, నాగర్‌కర్నూల్ జిల్లా కో-కన్వీనర్ అరకాల రమేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

### డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హామీ



**వనపర్తి, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
విబి-జి రామ్‌జి (గ్రామీణ్) ఉద్యోగుల పెండింగ్ వేతనాలు, క్యాడర్ స్ట్రెంత్, పదోన్నతులు, బదిలీలు, కెరీర్ అడ్వాన్స్‌మెంట్ తదితర సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి తెలిపారు. ఉద్యోగుల వినతిపత్రం స్వీకరించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారంపై చర్చించారు. పే స్కేల్ అమలు విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తానని ఉద్యోగులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా జేఏసి కన్వీనర్ బాలయ్య, కో కన్వీనర్ కోళ్ల సత్తన్న, టీపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, ఉద్యోగులు భాస్కర్, రామస్వామి, ముఖీద్ అన్ని మండలాలకు సంబంధించిన వారు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు శాఖల సమన్వయం అవసరం

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




**నిర్మల్, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
జిల్లాను మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు, అక్రమ గుట్కా రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. యువతలో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి రాథోడ్ రమేష్, జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్, ఆర్డీఓ దేవీదాస్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాషగూడెంలో తల్లిపాల వారోత్సవాలు

**రాజాపేట, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**



యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం కాషగూడం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎండి షరీఫ్, తల్లులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతపై నినాదాలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్ కృష్ణలీల తల్లిపాల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

## తక్కువ నీటితో సాగయ్యే పంటలు వేయాలని అవగాహన



**కోరుట్ల రూరల్, ఆగస్టు 3 (తెలంగాణ వాణి)**
కోరుట్ల మండలంలోని నాగులపెట గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎలినో ప్రభావం వర్షభావ పరిస్థితిలలో మెట్ట పంటల సాగు పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎలినినో ప్రభావంతో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవని నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులు తక్కువ నీటితో సాగయ్యే మెట్ట పంటలను ప్రాధాన్యంగా సాగు చేయాలని సూచించారు. పెసలు, మినుములు, కందులు, సోయాబీన్, వేరుశనగ, జొన్న,పొద్దుతిరుగుడు , ఆయిల్ ఫామ్ వంటి పంటలు తక్కువ నీటితో మెరుగైన దిగుబడిని అందిస్తాయని, సాగుతో పెట్టుబడి భారం తగ్గుతుందని రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. వివరించారు. రైతులు వారి వ్యవసాయ భూమిలో నీటి కుంటలు నిర్మించాలని , వలన భూగర్భ జలాలు పెరుగుతావి, చీడపీడల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకుంటే దిగుబడి మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ . ఏవో నాగమణి, రైతులు పాల్గొన్నారు.




## గ్రామాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

- సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయండి
- శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, ఆగస్టు 3, (తెలంగాణ వాణి):**
పటాన్ చెరు, గుమ్మడిదల మండల పరిధిలో గల గ్రామాలలో ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయాలని స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సోమవారం సాయంత్రం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పటాన్ చెరు, గుమ్మడిదల మండలాల పరిధి లోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, పిఆర్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులతో పాటు సిఎస్ఆర్ నిధులు కేటాయిస్తామని తెలిపారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో పరిష్కారానికి నోచుకోని సమస్యలను తన దృష్టికి తీసుకొని వస్తే.. పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నందిగామ గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తే. రాబోయే పది రోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు. దీని ద్వారా ప్రతినెల గ్రామపంచాయతీకి ఆదాయం లభిస్తుందని తెలిపారు. భానూరు, క్యాసారం, నందిగామ గ్రామపంచాయతీ ల నిధులతో అభివృద్ధి



కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని ఆదేశించారు. గుమ్మడిదల మండల పరిధిలోని అనంతరం, కానుకుంట, నూతనకల్, కొత్తపల్లి, తదితర గ్రామాల పరిధిలో అంతర్గత రహదారుల నిర్మాణానికి హ్యామ్ ద్వారా నిధులు మంజూరయ్యాయని.. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు డిఈ దీపక్ తెలిపారు. టెండర్లు పూర్తి చేసిన పనులు ప్రారంభించక పోతే.. సంబంధిత కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు యాదగిరి, ఉమాదేవి, పిఆర్ డిఈ దీపక్, ఎంపీఓ హరిశంకర్ గౌడ్, ఏఈ శశిధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కరీంనగర్--పిట్లం జాతీయ రహదారికి వెంటనే ఆమోదం ఇవ్వాలి

**కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కోరిన ఎమ్మెల్యే మదన్ మోహన్**

**ఎల్లారెడ్డి, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
కరీంనగర్--సిరిసిల్ల--వేములవాడ--కామారెడ్డి--ఎల్లారెడ్డి--పిట్లం వరకు 165 కిలోమీటర్ల రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించి వెంటనే ఆమోదం, నిధులు మంజూరు చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ రహదారి వల్ల రవాణా, వాణిజ్యం, వ్యవసాయం, పర్యాటక రంగాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన పరిపాలనా, ఆర్థిక అనుమతులు మంజూరు చేయాలని



కోరారు.

## రెవెన్యూ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
రెవెన్యూ శాఖకు సంబంధించిన ప్రజల దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. భూ భారతి, ప్రజావాణి, సీఎం ప్రజావాణి, సదాబైనామా తదితర భూ సమస్యల దరఖాస్తులను ప్రత్యేక డ్రైవ్ ద్వారా పూర్తి చేయాలని సూచించారు. తిరస్కరించే దరఖాస్తులకు స్పష్టమైన కారణాలు నమోదు చేయాలని, భూముల సర్వే, రీ-సర్వే పనులు వేగవంతం చేయడంతో పాటు ఇసుక అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిప్యూటీ




కలెక్టర్ రాకేష్, డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఏడీ ల్యాండ్ సర్వే రికార్డ్స్ నరసింహమూర్తి, తహసీల్దార్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటియుసి వరంగల్ జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయండి

**సివిల్ సప్లై రాష్ట్ర అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్**

**నర్సంపేట: ఆగస్టు 3 ( తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఈనెల ఆగస్టు 4, 5 తేదిలలో మంగళవారం బుధవారం రోజులలో నెక్కొండ మండల కేంద్రం వాసవి కళ్యాణ మండపం శుభకార్య వేదిక ప్రాంగణం యందు నిర్వహించు ఏఐటియుసి వరంగల్ జిల్లా నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని సివిల్ సప్లై హమాలి కార్మిక రాష్ట్ర అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్ పిలుపునిచ్చారు. నర్సంపేటలో ఈరోజు 3 ఆగస్టు 2026 సోమవారం రోజున నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కార్మిక హక్కుల కోసం అహర్నిశలు శ్రమిస్తున్నటువంటి ఏఐటీయూసీ నాలుగవ జిల్లా మహాసభలను హమాలి ఆటో భవన నిర్మాణ ఆశ అంగన్వాడి మధ్యాహ్నం భోజనం స్కావెంజర్స్ గుమస్తాలు ప్రతి ఒక్కరూ ఈ జిల్లా మహాసభలకు హాజరై కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు నందియాలని




పిలుపునిచ్చారు కార్మికుల కష్టాల్లో రెపరెపలాడే ఎర్రజెండా ఏఐటియుసి అని కార్మికుల చెమట చుక్కలను దోచుకుంటున్నటు వంటి కార్పొరేట్ శక్తుల గుండెల్లో గడగడలాడించే గుణపమే ఏఐటీయూసి అని గుంపెల్లి మునీశ్వర్ అన్నారు .ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అక్క పెల్లి రమేష్, ఇల్లందుల సాంబయ్య, ఎడ్ల నాగులు, ఓదెల కనకమల్లు, చీకటిబని, నాగరాజు, ప్రసాద్ ,ముసుగు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మోహన్‌రావుపేట ప్రభుత్వ పాఠశాలలో బాలసభ

**కోరుట్ల రూరల్, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
మండలంలోని మోహన్‌రావుపేట జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బాలసభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ సమస్యలు, అవసరాలు, పాఠశాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించి పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో




సర్పంచ్ సరికెళ్ళ లతిక నరేష్, ఉప సర్పంచ్ జాన వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఆనందరావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు



## చెరుకు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

### రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు.

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 3 (తెలంగాణ వాణి విలేకరి)**
కోరుట్ల నియోజకవర్గం మల్లాపూర్ మండలంలోని ముత్యం పేట నిజాం చక్కెర కర్మాగారంగత టిఆర్ఎస్ ప్రభుత్వం మూసి వేయడంతొ చెరకు రైతులు కామారెడ్డి లో ఉన్న ప్రైవేటు చెక్కెర ఫ్యాక్టరీతమ చెరుకు ను తరలించడం వల్ల అదనంగా 400 రూపాయల భారం పడుతుందని చెరుకు రైతులు ఇబ్రహీం పట్నం మండలంలో నిర్వహించిన సర్ పునఃశ్చరణ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ను కలిసి తమ సమస్యలు తెలిపారు ఈ సందర్భంగా చెరకు రైతుల సమస్యల పరిష్కారం కోసం సంబందిత మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు అదే విధంగా ముత్యంపేట లో మూతపడ్డ చక్కెర కర్మగారాన్ని తిరిగి తెరిపించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంద అన్నారు.

## పౌరసరఫరాల అధికారిని కలిసిన వినియోగదారుల సంఘాల ప్రతినిధులు



**భువనగిరి, ఆగస్టు 3 (తెలంగాణ వాణి)**
: యాదాద్రి భువనగిరి జిల్లా వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ సభ్యులు జిల్లా పౌరసరఫరాల అధికారి రోజారాణిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. జిల్లాలో వినియోగదారుల సంఘాలను బలోపేతం చేయడంలో సహకరించాలని కోరుతూ, వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించేందుకు సభలు, చైతన్య సదస్సులు నిర్వహిస్తామని కమిటీ అధ్యక్షుడు పోచం సోమయ్య, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి యాదగిరి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ కొడారి వెంకటేష్, జిల్లా వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ ఉపాధ్యక్షులు ఎలిమినేటి నగేష్, దేవునిగూడెపు బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**బీజేపీ యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి**

**తిమ్మాపూర్, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**



ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని కోరిన విద్యార్థులను "క్రిమినల్ వేస్ట్"గా అభివర్ణి ంచడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకారానికి నిదర్శన మని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి, వ్యాఖ్యలను ఉపసంహరించుకుని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

### ఎంపీడీవో వేముల సుమలత



**ధర్మారం, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
ధర్మారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 30 మందిని ఉచిత శస్త్రచికిత్సల కోసం ఆసుపత్రికి తరలించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీడీవో వేముల సుమలత లయన్స్ క్లబ్ సేవలను ప్రశంసిస్తూ, నేత్రదానం, రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ దాగేటి రాజేశ్వరి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో చైర్మన్లు డాక్టర్ కామని శ్రీనివాస్,పుచ్చకాయల మునిందర్ రెడ్డి, డిస్టిక్ మైక్రో క్యాబినెట్ సభ్యులు సామ ఎల్లారెడ్డి, డిస్టిక్ జిఎస్టి కోఆర్డినేటర్ సాదుల వెంకటేశ్వర్లు, రిజనల్ చైర్మన్ కావేటి రాజగోపాల్, జోన్ చైర్మన్ తలమక్కి రవీందర్ శెట్టి, క్లబ్ కార్యదర్శి కట్ట రమేష్, నాడెం శ్రీనివాస్, ఎండి ముజాహిద్ పాల్గొన్నారు

## చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతి

**లక్షెట్టిపేట, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**



చేపలు పట్టేందుకు వెళ్లిన రాపల్లి రమేష్ (45) చెరువులో మునిగి మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. మహాలక్ష్మివాడ చెరువులో వల వేస్తుండగా అది చేతికి, కాలికి చిక్కుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## తలసేమియా, సికిల్ సెల్ బాధితులకు పింఛన్లు

### -సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



**మంచిర్యాల, ఆగస్ట్ 03 (తెలంగాణ వాణి):**
తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు ఆగస్టు 15వ తేదీ నుంచి నెలవారీ సామాజిక భద్రత పింఛన్లు మంజూరు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంచిర్యాలలో పాలాభిషేక కార్యక్రమం నిర్వహించారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఐబీ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు, జిల్లా రెడ్‌క్రాస్ అసోసియేషన్ సభ్యులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు మాట్లాడుతూ తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా బాధితుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రత పింఛన్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. ఈ నిర్ణయం ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థికంగా కొంత భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, రెడ్‌క్రాస్ అసోసియేషన్ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దారిమైసమ్మకు ప్రత్యేక పూజలు



**జమ్మికుంట, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
జమ్మికుంట పట్టణంలోని కొత్తపల్లి ఫ్లైఓవర్ సమీపంలోని దారిమైసమ్మ ఆలయం వినాయక్‌నగర్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. వాహనదారులు సురక్షితంగా ప్రయాణించి ప్రమాదాలు జరగకుండా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని భక్తులు ప్రార్థించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న డాక్టర్ రఘుపతి రెడ్డి గూడూరిమల్లారెడ్డి రంగు సత్యనారాయణ గుండ సదానందం బజ్జూరి శ్రీనివాస్ యాళ్ల శ్రీనివాస్ రెడ్డి నాంపల్లి ప్రకాష్ తనుగుల రామారావు బైరం భాస్కర్ అంబాల శ్రీరామ్ కందికట్ల శ్రీనివాస్ విజయ గిరి నాగార్జున రంగు ప్రవీణ్ క్యాతం ప్రకాష్ పెండెం అవినాష్ తడంరమేష్ బుర్ర మల్లికార్జున్ అంబాల రఘు ప్రవీణ్ బబ్బులు బన్నీ తదితరులు పాల్గొన్నారు

## తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన



**తిమ్మాపూర్,ఆగస్టు 3, ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
తల్లిపాలు అమృతం వంటివి ని సర్పంచ్ ఎలుక ఆంజనేయులు అన్నారు. తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారికి పుట్టిన 15 నిమిషాల్లోపు ముర్రు పాలు తాగించాలని సూచించారు. బిడ్డకు రెండేళ్ల వరకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి జూవేరియా, సూపర్వైజర్ వెంకటేశ్వరి, ఐ.సి.డి.ఎస్ సూపర్వైజర్ సి.హెచ్ పద్మ, ఏ.ఎన్.ఎం పద్మ మరియు వార్డు సభ్యులు, అంగన్వాడి టీచర్స్,ఆశా కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలు, తల్లులు మహిళలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయవద్దు

### డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):** కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ శ్రేణులు నిర్లక్ష్యం చేయకుండా పకడ్బందీగా నిర్వహించాలని డీసీసీ జిల్లా అధ్యక్షుడు గాజంగి నందయ్య పిలుపునిచ్చారు. కోరుట్ల నియోజకవర్గంలో అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చూడాలని సూచించారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన సమావేశంలో 100 శాతం లక్ష్యాన్ని సాధించిన కాంగ్రెస్ బీఎల్ఏలను నందయ్య, జువ్వాడి కృష్ణారావు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొరిగం రాజు వైస్ చైర్మన్ ఎలాల వెంకటరెడ్డి సర్పంచ్ లువార్డ్ సభ్యులు మహిళా,యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఘనంగా ఆషాఢ గోరింటాకు వేడుకలు



**పెద్దపల్లి, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
రామగుండం నియోజకవర్గం గంగానగర్ పవర్ హౌస్ కాలనీలో ఆషాఢ మాసం గోరింటాకు వేడుకలను మహిళలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని కూడా ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కౌశిక లత మహిళలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇలాంటి కార్యక్రమాలు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు మహిళల ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు.

## దళిత సమస్యలు పరిష్కరించాలి: డీహెచ్‌పీఎస్





**భువనగిరి, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
దళితుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని ఆరోపిస్తూ డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి, ఎన్నికల హామీల అమలు, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల పునరుద్ధరణ, దళితులకు ఇళ్లు, ఇండ్ల స్థలాలు, ఉపాధి అవకాశాలు, పోడు భూములకు పట్టాలు, రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా కార్యక్రమానికి ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేష్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ మద్దతు తెలుపగా కార్యక్రమంలో డిహెచ్ పిఎస్ నాయకులు పిట్టల శంకర్, పోతూ ప్రవీణ్, మామిడికాయల నరసింహ, చెడె సుందరయ్య, గుండెపు వెంకటయ్య, వాసం గాలయ్య, వెంకన్న, ధనమ్మ, స్వామి, ముత్యాలు, జంగయ్య, శ్యాగ జానూ మనోహర, శ్రీను, రాములు అండాలు, వసంత, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ కోసం ఒక చెట్టు నాటాలి: పలుస శంకర్ గౌడ్



**వనపర్తి, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
పెద్దగూడెం శివారులోని రేడియంట్ ఉన్నత పాఠశాలలో "అమ్మ కోసం ఒక చెట్టు" కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక చెట్టు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. చెట్ల సంరక్షణతో స్వచ్ఛమైన గాలి, వర్షాలు, భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ కౌసల్య, ప్రిన్సిపాల్ ఉప్పరి తిరుమలేష్ విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉప్పరి తిరుమలేష్, వైస్ ప్రిన్సిపాల్ రాము, ఎకో క్లబ్ కన్వీనర్ శృతి ఉపాధ్యాయులు ,నరేష్, శాంతయ్య, రాహుల్, శ్రీనివాస్, రాజిత, సావిత్రి, సాత్విక, రామేశ్వరి, ఖదీరున్నీసా,సరోజ,అఖిల్, పీఈటీ వెంకటేష్, తల్లిదండ్రులు తధితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్



**సూర్యాపేట, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. అన్ని దరఖాస్తులను ప్రజావాణి పోర్టల్‌లో వెంటనే నమోదు చేసి, పెండింగ్ వినతులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 117 దరఖాస్తులు అందగా, వాటిలో 59 భూ సమస్యలకు సంబంధించినవి కాగా, మిగతావి వివిధ శాఖలకు చెందినవిగా తెలిపారు. సంబంధిత శాఖలకు వాటిని పరిష్కారం కోసం పంపినట్లు వెల్లడించారు.

## శ్రీ చైతన్య లో గోరింటాకు సంబరాలు



**జగిత్యాల/ వెల్గటూర్: ఆగస్టు 03(తెలంగాణ వాణి ప్రతినిధి)**
జగిత్యాల జిల్లా మండల కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల లో ఆషాడ మాసం సందర్భంగా మహిళా ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బిడారి సతీష్ మాట్లాడుతూ పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు సమాజంలో జరిగే ప్రతి విషయం తెలియజేప్పాలని సదుద్దేశంతో ప్రతీ కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. పూర్వకాలంలో గోరింటాకు ధరించడం వల్ల వర్షాకాలంలో సంభవించే క్రీములు, చిన్న చిన్న బ్యాక్టీరియాలు మన చేతి పైకి రాకుండా గోరింటాకు అడ్డుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వనజ, అంజలి,గౌతమి , సంధ్య, మల్లీశ్వరి, అండాల్, రజిత, సాత్విక,,కళ్యాణి, సునీత, సాహితి, అనూష, రంజిత, సువర్ణ, స్వప్న, శిరీష, అనిత, వ్యాయామ ఉపాధ్యాయురాలు సుమ విద్యార్థులు పాల్గొన్నారు.

## యువతకు వాలీబాల్ కిట్‌ల పంపిణీ



**పెద్దపల్లి, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
అంతర్గాం మండలం టి.టి.ఎస్. అంతర్గాం గ్రామంలో యూత్ కాంగ్రెస్ నాయకుడు అలకుంట రాజేశం ఆధ్వర్యంలో యువ క్రీడాకారులకు వాలీబాల్ కిట్‌లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మనాలి రాజ్ ఠాకూర్ గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. యువత అభివృద్ధికి క్రీడలను ప్రోత్సహించే కార్యక్రమాలను కొనసాగిస్తామని అలకుంట రాజేశం తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అలకుంట సంజీవ్, దొబ్బల తరుణ్ కుమార్, రఘు, కార్తీక్, శ్రీనివాస్, రాకేష్, నరేష్, లక్ష్మణ్, విజయ్, నిఖిల్, శంకర్, స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు, క్రీడాకారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**మహాదేవపూర్, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పెండింగ్ కేసులు, రికార్డుల నిర్వహణ, దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి సత్వర పరిష్కారం చూపాలని, కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని అధికారులను ఆదేశించారు. రౌడీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగిస్తూ, ప్రజలకు మర్యాదపూర్వకంగా, పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. ఈ వార్షిక తనిఖీలలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహాదేవ్‌పూర్ సీఐ వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.



## కుంటలో మునిగి ఇద్దరు విద్యార్థుల మృతి

**జగిత్యాల, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
మల్యాల మండలంలోని బాలుర వసతి గృహంలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు కుంటలో మునిగి మృతి చెందారు. మృతులు నాలుగో తరగతి విద్యార్థి జగన్నాథం సుశాంత్, ఐదో తరగతి విద్యార్థి వనం విష్ణుగా గుర్తించారు. గల్లంతైన వారిని పోలీసులు, స్థానికులు గాలించి కుంటలో మృతదేహాలను వెలికితీశారు. పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలే ఉత్తమం

### సర్పంచ్ అబీబా బీ

**రాయికోడ్, ఆగస్టు 3 (తెలంగాణ వాణి)**
: సంగారెడ్డి జిల్లా మాటూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ అబీబా బీ మాట్లాడుతూ, బిడ్డ పుట్టినప్పటి నుంచి తల్లిపాలే ఇవ్వాలని, ముర్రుపాలలోని పోషకాలు శిశువు ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని, శిశువులకు పోతపాలు ఇవ్వకుండా తల్లిపాలనే అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జావీద్ బాషా,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొహమ్మద్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర ప్రసాద్, మక్సూద్,రేషన్ డీలర్ ప్రభాకర్, అంగన్వాడీ ఆయ తుల్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పునూతల పురుషోత్తం రెడ్డికి నివాళి

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**గుండాల, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
మాజీ మంత్రి స్వర్గీయ ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పురుషోత్తం రెడ్డి ప్రజాసేవకు అంకితమైన నాయకుడని కొనియాడిన ఆయన, గుండాల మండల కేంద్రంలో ఆయన విగ్రహం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం

### బీఆర్ఎస్ ఆరోపణలు అసత్యమని కాంగ్రెస్ నేతల విమర్శ



**ధర్మారం, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
ఎల్లంపల్లి ప్రాజెక్టుపై బీఆర్ఎస్ చేస్తున్న అసత్య ప్రచారాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు నంది మేడారం పంప్‌హౌస్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ, ఎల్లంపల్లి ప్రాజెక్టు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రాజెక్టు నీటిని కాళేశ్వరం నీరుగా ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. ప్రజలను మభ్యపెట్టే ప్రచారాన్ని మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్‌లో వైభవంగా బోనాల జాతర



**హుజురాబాద్, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
హుజురాబాద్‌లోని ఆల్ఫోర్స్ జీనియస్ పాఠశాలలో బోనాల మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆల్ఫోర్స్ చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనం సమర్పించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. అనంతరం హౌస్ ఎలక్షన్స్‌లో గెలిచిన కెప్టెన్లు, వైస్ కెప్టెన్లు, ఎఫ్ఏ-1లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పోతరాజుల వేషధారణతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

## జనావాసాల మధ్య కోళ్ల ఫారం తొలగించాలి

**మహాదేవపూర్, ఆగస్టు 3 (తెలంగాణ వాణి)**
: కాళేశ్వరం కోంద్రవాడలో జనావాసాల మధ్య కొనసాగుతున్న కోళ్ల ఫారాన్ని వెంటనే తొలగించాలని వార్డు సభ్యులు అధికారులను కోరారు. ఫారం నుంచి వెలువడుతున్న దుర్వాసన, ఈగలు, దోమల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పిల్లలు, వృద్ధులు, గర్భిణుల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కోళ్ల ఫారాన్ని గ్రామానికి దూరంగా తరలించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు కొంద్ర శ్రీనివాస్ కొంద్ర రవి కొంద్ర రాజబాబు తోట శ్రీనివాస్ దాగం బాబు కొంద్ర సడవల్లి కొంద్ర తిరుపతి జక్కుల రాజబాబు గంట వెంకటస్వామి కొండ కిష్టయ్య కాటారపు రాజబాబు కాటారపు శేఖర్ ముత్యాల లక్ష్మణ్ సంబంధిత అధికారులను కోరారు.

## మృతి రైతు కుటుంబాలకు పరిహారం వెంటనే చెల్లించాలి: బీఆర్ఎస్



**మంచిర్యాల, ఆగస్టు 3 (తెలంగాణ వాణి): దండేపల్లి,**
లక్షెట్టిపేట మండలాల్లో అకాల వర్షాలతో మృతి చెందిన నలుగురు రైతు కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి, మూడు నెలలు గడిచినా పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హామీ అమలు చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలికపై వేధింపులు ఆపాలి:ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**మంచిర్యాల,ఆగస్ట్ 03 (తెలంగాణ వాణి):**




15 ఏళ్ల బాలికను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో అత్యాచారం, ప్రాణహాని బెదిరింపులకు పాల్పడటం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. బాలికను బెదిరించి క్షమాపణ చెప్పేలా ఒత్తిడి చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.బాలికపై వేధింపులకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలు, బాలికల భద్రత విషయంలో ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా కఠినంగా వ్యవహరించాలని కోరారు. ప్రజల సమస్యలపై పార్లమెంట్‌లో లేవనెత్తే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలపై నిఘా కోసం కాకుండా, నేరాలకు పాల్పడే వారిని గుర్తించి చట్టం ముందు నిలబెట్టేందుకు ఉపయోగించాలని సూచించారు. ప్రజాస్వామ్య విలువలు, మహిళల భద్రత, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.

## గాంధారి మైసమ్మ జాతర వాల్ పోస్టర్ విడుదల



**రామకృష్ణాపూర్, ఆగస్ట్ 03 (తెలంగాణ వాణి):**
క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారి లో బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ దేవాలయంలో ఈనెల 9న నిర్వహించనున్న ఆషాఢ మాస బోనాల జాతర వాల్ పోస్టర్‌ను సోమవారం ఆలయ కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులు బోనాలు సమర్పించుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.జాతరకు వచ్చే భక్తులకు తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య శిబిరం, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గాంధారి మైసమ్మ అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ కోరారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జక్కుల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి ఎం. సత్యనారాయణ, పోరెడ్డి మొండి, ఎం. కనకయ్య, కందునూరి రాజయ్య, వెనంక కుమార్, మొగిలి ఓదెలు, పారుపెల్లి తిరుపతి, భీమా శరత్, పల్లె ఓదెలు, మొగిలి గట్టయ్య, బాలాజీ భవాని, పూజారి లవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పంచాయతీ అధికారికి టీఎన్జీవో ఘన సన్మానం



**మంచిర్యాల, ఆగస్ట్ 03 (తెలంగాణ వాణి):**
జిల్లా పంచాయతీ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్. కిషన్ ను టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు.టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ విభాగ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని డీపీఓను కోరారు. ఉద్యోగుల సంక్షేమం, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తానని డీపీఓ ఎస్. కిషన్ తెలిపారు. పంచాయతీరాజ్ విభాగంలో ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించి మంచిర్యాల జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి బొడ్డు శ్రావణ్‌కుమార్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, కోశాధికారి సతీష్‌కుమార్, ఉపాధ్యక్షులు తిరుపతి, రాంకుమార్, నరేందర్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్, కార్యదర్శి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మత్తు రహిత సమాజ నిర్మాణం మనందరి బాధ్యత

### - జిట్స్‌లో అవగాహన సదస్సు



**తిమ్మాపూర్,ఆగస్టు 3, (తెలంగాణ వాణి ప్రతినిధి )**
తిమ్మాపూర్ మండలంలోని జ్యోతిష్మతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (జిట్స్)లో ఎన్ఎస్-ఎస్ ఆధ్వర్యంలో సోమవారం మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎస్. ఉపేందర్, సీఐలు బి. రమేష్, ఎం.డి. రఫీఖ్ ఖాన్, ఎస్సైలు భారతి, సయ్యద్ అన్వర్, జి. రమేష్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, వాటికి దూరంగా ఉంటూ క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు.కళాశాల చైర్మన్ జె. సాగర్ రావు, సెక్రటరీ ఉ కరస్పాండెంట్ జె. సుమిత్ సాయి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సామాజిక చైతన్యం పెంపొందించడం సమస్త ముఖ్య లక్షణం అని తెలిపారు. విద్యార్థులు మత్తు రహిత సమాజ నిర్మాణానికి రాయబారులుగా మారాలని కోరారు. డీన్ డా. పి.కె. వైశాలి, ప్రిన్సిపాల్ డా. టి. అనిల్ కుమార్ విద్యార్థులతో "మాదకద్రవ్యాలకు నో చెప్పండి.జీవితానికి అవును చెప్పండి అని ప్రతిజ్ఞ చేయించారు.పోలీస్, ఎక్సైజ్ అధికారులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. పి. ప్రణీత, అధ్యాపకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తల్లిపాలు అమృతం లాంటివి..

**జగిత్యాల సిడిపిఓ జయప్రద.**

**జగిత్యాల: ఆగస్టు 3 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని పుట్టిన అరగంటలోపే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని జగిత్యాల సిడిపిఓ జయప్రద అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం జగిత్యాల అర్బన్ 1వ సెక్టార్ లోని అంగన్వాడీ కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 26వ వార్డు కౌన్సిలర్ పులి రమ, సిడిపిఓ జయప్రద పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపివో మాట్లాడుతూ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించడం వల్ల బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ముర్రుపాలు మొదటి టీకా లాగా పని చేస్తుందన్నారు. ఆరు నెలలు నిండేదాక తల్లిపాలు తప్ప ఎలాంటి ద్రవపదార్థాలు ఇవ్వకూడదన్నారు. బిడ్డలకు పాలు ఇవ్వని తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. గర్భవతులు ఆకుకూరలు, తాజా కూరగాయలు తీసుకోవాలని, ఆయోడిన్ ఉప్పు , పప్పు దినుసులు ఎక్కువ శాతం తీసుకుంటే ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. అంగన్వాడి కేంద్రాలలో అందించే



పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఏడు నెలల పిల్లలకు బాలామృతాన్ని కచ్చితంగా తినిపించాలని అందులో ఐరన్, ఎ, బి.సి విటమిన్లతో పాటు ఫోలిక్ యాసిడ్ ఉంటుందని ఇవి ఎదిగే బిడ్డలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఈ సందర్భంగా ఏడు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు మమత, కవిత అంగన్వాడీ టీచర్లు దయావతి, యతీశ్వరి, సౌజన్య, ఏఎన్ఎం శిరీష, ఆశ లావణ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# భాదితులకు సత్వరమే న్యాయం

**గ్రీవెన్స్ డేలో 26 ఫిర్యాదుల స్వీకరణ..**

**జగిత్యాల: ఆగస్టు 3 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు బాధితుల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే కార్యక్రమం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి పరిశీలించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 26 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులు సమర్పించిన వినతిపత్రాలు,సంబంధిత పత్రాలను పరిశీలించిన ఎస్పీ, ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా,పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు



చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. జిల్లా పోలీసు శాఖ ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించేందుకు కట్టుబడి ఉందని, ప్రతి ఫిర్యాదును బాధ్యతతో పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**జగిత్యాల: ఆగస్టు 3 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి, పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తారని, అధికారులు తమ శాఖలకు సంబంధించిన అర్జీలను సానుకూల దృక్పథంతో పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో



మొత్తం 60 ఫిర్యాదులు, వినతులు అందాయని, వాటిని వెంటనే సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, బి. రాజగౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం

**పటాన్ చెరు, ఆగస్టు 3, (తెలంగాణ వాణి):**
పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్తంగి గ్రామానికి చెందిన తలారి మాధవి (20) అనే మహిళ ఈ రోజు ఉదయం సుమారు 10 గంటల సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి, అనంతరం తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె భర్త చెన్నయ్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదులో నర్సింలు అనే



వ్యక్తిపై తనకు అనుమానం ఉన్నట్లు భర్త పేర్కొన్నారు. ఆ కోణంలో కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. మహిళ ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించడం, బంధువులు, స్నేహితులు, సంబంధిత వ్యక్తులను విచారిస్తున్నారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు లేదా పటాన్ చెరు పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

## వీధి దీపాల మరమ్మతులు వేగవంతం చేయాలి: సామెల్ కార్తీక్

**శేరిలింగంపల్లి (తెలంగాణ వాణి)**
డివిజన్‌లోని పాపిరెడ్డి కాలనీ, రాజీవ్ గృహకల్ప, లింగంపల్లి గ్రామం తదితర ప్రాంతాల్లో పనిచేయని వీధి దీపాలను వెంటనే మరమ్మతు చేసి కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని టీపీసీసీ కార్యదర్శి సామెల్ కార్తీక్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. బోనాలు, వినాయక చవితి, దసరా ఉత్సవాల దృష్ట్యా పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, ప్రజా ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సూర్య రాథోడ్,



విద్యార్థి నాయకుడు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చిట్టిల పేరిట 4 కోట్లతో మాయమైన లేడీ కిలాడి

- నమ్మించి బోర్డు తిప్పేసిన బిఎస్ఆర్ కాలనీ మహిళ
- రోడ్డున పడ్డ కుటుంబాలు
- పిఎస్ మెట్లెక్కిన బాధితులు

**పటాన్ చెరు ఆగస్టు 3 (తెలంగాణ వాణీ)**
అమీన్పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని బిఎస్సార్ కాలనీకి చెందిన చిట్టిల వ్యాపారి మహిళ మాయాజాలం, చిట్టీలు అధిక వడ్డీల పేరుతో నమ్మబలికి బాధితుల నుంచి విడతల వారీగా దాదాపు రూ.4 కోట్ల వరకు వసూలు చేసి అదృశ్యం అవ్వడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. వివరాల్లోకి వెళితే బి ఎస్ ఆర్ కాలనీకి చెందిన ఓ మహిళ చిట్టిల వ్యాపారం పేరుతో స్థానికులను నమ్మించి వారి దగ్గర నుండి రూ.4 కోట్ల రూపాయలు వసూలు చేసి సొంత ఇల్లును కూడా అమ్ముకొని హుడాయించింది. స్టేషన్ బాట పట్టిన బాధితులు తమకు రావలసిన డబ్బులు ఇవ్వకుండా సదరు మహిళ చేతులెత్తేయడంతో మోసపోయామని గ్రహించిన బాధితులంతా ఒక్కసారిగా పోలీస్ స్టేషన్కు చేరుకొని ఆందోళన




వ్యక్తం చేయడం జరిగింది. ఆవిరైన కష్టార్జితం ఇళ్లల్లో దాచుకున్న పొదుపు సొమ్ము , కూలినాలి చేసుకొని కూడబెట్టిన డబ్బులు ఆడపిల్లల పెళ్లి కోసం దాచుకున్న నగదు మొత్తం మోసపోవడంతో బాధితులు కన్నీరు మున్నీరు అయ్యారు. రంగంలోకి పోలీసులు, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నింది తురాలి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు



## పాఠశాలలో బాల గ్రామసభ

**నాగిరెడ్డిపేట మండలం ఆగస్టు 3:( తెలంగాణ వాణి ప్రతినిధి)**
నాగిరెడ్డిపేట మండలం లోని బొల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రోజున బాలల గ్రామ సభను ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ ప్రభు గౌడ్ పాల్గొన్నారు . బాల గ్రామ సభను ఉద్దేశించి గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ బాలల హక్కులు రక్షణ సంక్షేమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు . ప్రస్తుత సమాజంలో జరుగుతున్నటువంటి చెడు కార్యక్రమాలకు అనుగుణంగా ఫోక్సో చట్టం , బాలలపై నేరాలు నివారణ , విద్యా ప్రాముఖ్యత , ఆరోగ్యం, పరిశుభ్రత , బాల్యవివాహాల నిర్మాణపై విద్యార్థులకు సంక్లిష్టంగా వివరించారు . ఇట్టి కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ , పాఠశాల సిబ్బంది గ్రామ కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు .

## అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

**తిమ్మాపూర్, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**



తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామానికి చెందిన మెరుగు వెంకన్న (60) అనారోగ్యంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందు కున్న ఎల్ఎండీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిం చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఎస్టి మినీ గురుకుల విద్యార్థులకు స్కూల్ డ్రెస్‌లు అందజేత



**ధర్మారం, ఆగస్టు 03 (తెలంగాణ వాణి )**
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని జక్కన్న పల్లి గ్రామంలో ఉన్న ఎస్టి మినీ గురుకుల బాలికల పాఠశాలకు ఫస్ట్ ఫెయిర్ లో స్కూల్ డ్రెస్ అందించినట్లు పాఠశాల హెచ్ఎం శ్రీలత తెలిపారు. ఆగస్టు 15 లోపు గురుకుల పాఠశాల విద్యార్థులకు 2026 -27 సంవత్సరానికి గాను విద్యార్థులందరికీ కొత్త స్కూల్ డ్రెస్సులు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళుతుందని ఈ క్రమంలో మా పాఠశాల విద్యార్థులకు డ్రస్సులు అందించినందుకు ప్రభుత్వానికి హెచ్ఎం శ్రీలత, ఉపాధ్యాయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీఎం పోచం, టీచింగ్ కాంట్రాక్టర్స్ తోట లావణ్య, సుంచు స్వప్న, ఎల్మదాసరి లావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బీజేపీ మాజీ నాయకుడు మదనాచారి బీఆర్ఎస్‌లో చేరిక



**హైదరాబాద్/శేరిలింగంపల్లి, ఆగస్టు 3 (తెలంగాణ వాణి):**
మాదాపూర్ డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు మదనాచారి సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అండదండలతో ఈ చేరిక జరిగింది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు సమన్వయంతో పనిచేయాలని కేటీఆర్ సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, నాయకులు లక్ష్మణ్, నరేందర్ రెడ్డి, అభినంద్, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతిభా విద్యార్థులకు వౌపా పురస్కారాలు



**జమ్మికుంట (తెలంగాణ వాణి)**
జమ్మికుంటలో వౌపా ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులను శాలువాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తి పెంపొందించడమే లక్ష్యమని వౌపా నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దిలీప్, కౌన్సిలర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిపై ప్రజావాణిలో ఫిర్యాదు

**శంకరపట్నం, ఆగస్ట్ 03 (తెలంగాణ వాణి)**
కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రం కేశవపట్నం గ్రామ పంచాయతీ కార్యదర్శిపై సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ కి ఫిర్యాదు చేసినట్లుగా అన్నారపు తిరుపతి తెలిపారు. పంచాయతీ ఆర్థిక సంఘం, సాధారణ నిధులను కార్య వర్గం తీర్మానం లేకుండా కార్యదర్శి ఖర్చులు చేస్తున్నారని, ఖర్చులకు తగిన గణాంకాల్లో అధిక ఖర్చులను పెడుతున్నారని, రసీదులు కోరితే దాటవేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారిని విచారణ చేయాల్సిందిగా ఆదేశించారని, జిల్లా పంచాయతీ అధికారి సంబంధిత ఎంపీఓని వారం రోజుల్లో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారని తెలిపారు.

## స్పారోకాన్ ఆర్కిటెక్ట్స్‌లో ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన గీతం విద్యార్థులు



**పటాన్ చెరు, ఆగస్టు 3 (తెలంగాణ వాణి)::**
హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మోసిన్, శ్రియా, మరియా స్పారోకాన్ ఆర్కిటెక్ట్స్ లో తమ వేసవి ఇంటర్న్‌షిప్ ను విజయవంతంగా పూర్తి చేశారు. స్పారోకాన్ ప్రిన్సిపల్ ఆర్కిటెక్ట్ ఆర్. జబ్బర్ షేక్ మార్గదర్శకత్వంలో వారు వృత్తిపరమైన ఆర్కిటెక్చరల్ విధానాలు, సమకాలీన డిజైన్ పద్ధతులు, ప్రాజెక్టు అమలు, కార్యాలయ నిర్వహణపై ప్రత్యక్ష అనుభవాన్ని పొందారు.గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ (జీసీజీసీ), యూనివర్సిటీ ఇండస్ట్రీ సెల్ (యూఐసీ) సమన్వయంతో ఈ అవకాశం లభించగా, ఆర్కిటెక్చర్ స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బందన్ కుమార్ మిశ్రా ఈ కార్యక్రమానికి మద్దతు అందించారు. విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు, నేర్చుకోవాలనే ఆసక్తి, వృత్తిపరమైన పనితీరును ఆర్కిటెక్ట్ జబ్బర్ షేక్ ప్రశంసించారు. భవిష్యత్తులో గీతంతో మరిన్ని ఇంటర్న్‌షిప్ లు, పరిశ్రమ-విద్యా భాగస్వామ్య కార్యక్రమాలు చేపట్టేందుకు ఆసక్తి వ్యక్తం చేసినట్లు విశ్వవిద్యాలయం వెల్లడించింది.

## పి ఆర్ టి యు టి ఎస్ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం



**రాజపేట ఆగస్టు: 03(తెలంగాణ వాణి విలేఖరి)**
యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండల కేంద్రంలో ని బొందుగుల గ్రామంలో నీ పి ఆర్ టి యు టి ఎస్ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా జడ్పీహెచ్ఎస్ బొందుగుల పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి గడసంతల మధుసూదన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను ఎల్లప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే సంఘం పీఆర్టీయూ టీఎస్ అని సిపిఎస్, డి ఎ,పీఆర్సీ మంచి ఫిట్మెంట్ తో ఇవ్వాలని,ఇతరత్రా బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.సెప్టెంబర్ లో భారీ ఎత్తున ధర్నా నిర్వహిస్తాము అని చెప్పారు. ఈ హెచ్ ఎస్ కార్డ్స్ కూడా తొందరగా అమలు అవుతుందని చెప్పారు. పీఆర్టీయూ సంఘం మాటలు చెప్పే సంఘం కాదని చేసి చూపించే సంఘం అని చెప్పారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పరమేష్ ,రాజపేట మండలం అధ్యక్ష కార్యదర్శులు సంపతి సుబ్బరాజు ,గౌటే బాలరాజు, మహిళా ఉపాధ్యక్షురాలు వాంకుడోతు భారతి, జిల్లా బాధ్యులు రవీందర్,నరేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో విస్తృత తనిఖీలు

### 20 ద్విచక్ర వాహనాలకు చలాన్లు..

### అక్రమ ఇసుక నిల్వలపై చట్టపరమైన చర్యలు



**జమ్మికుంట , ఆగస్టు 3. (తెలంగాణ వాణి ప్రతినిధి) :**
ఏసీపీ హుజురాబాద్ మాధవి మేడం ఆధ్వర్యంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ మరియు హుజురాబాద్ సబ్‌డివిజన్ పోలీసు సిబ్బందితో కలిసి సోమవారం విలాసాగర్, వావిలాల, గంద్రపల్లి గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టగా, సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటి యజమానులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం చలాన్లు విధించారు.అదేవిధంగా విలాసాగర్, వావిలాల గ్రామాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను పోలీసులు గుర్తించారు. సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకునే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ప్రజలు వాహనాలను నడిపేటప్పుడు తప్పనిసరిగా అన్ని చెల్లుబాటు అయ్యే పత్రాలను వెంట ఉంచుకోవాలని, అలాగే అక్రమ ఇసుక తవ్వకం, రవాణా, నిల్వ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అక్రమ కార్యకలాపాల నియంత్రణకు కట్టుబడి ఉన్నట్లు అధికారులు తెలిపారు

## వల్బపూర్‌లో ఉత్సాహంగా సాగిన గొర్రెల పెంపకదారుల సహకార సంఘం ఎన్నికలు




**వీణవంక, ఆగస్టు 3,(తెలంగాణ వాణి ప్రతినిధి) :**
కరీంనగర్ జిల్లా వీణవంక మండలం వల్బపూర్ గ్రామం లో గొర్రెల పెంపకదారుల సహకార సంఘం ఎన్నికలు సోమవారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఎన్నికల అధికారి పీవీ శివ నాగేందర్ రెడ్డి (కరీంనగర్ అసిస్టెంట్ రిజిస్ట్రార్) ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగింది.ఈ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ ఆఫీసర్ జలాలుద్దీన్ అక్బర్, అసిస్టెంట్ ఎన్నికల అధికారులు సమ్మయ్య, సయ్యద్ సాజిద్, ఎస్.పీ. రూపేష్ తదితరులు పాల్గొని ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు.పాలకవర్గ సభ్యుల ఎన్నికల్లో పల్లెబోయిన రాజకొమురయ్య, బొంకూరి రవి, న్యాలి ఉమేష్, బావు కుమారస్వామి, వీరబోయిన సతీష్, కుర్ర రాజయ్య, పల్లెబోయిన ఉపేందర్, పల్లెబోయిన సదయ్య, పల్లెబోయిన రాజ్‌కుమార్ అభ్యర్థులుగా బరిలో నిలిచారు.ఎన్నికల సందర్భంగా సభ్యులు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు . ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించడంతో పోలింగ్ ప్రశాంతంగా జరుగుతుంది,అనంతరం ఎన్నికల నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

## గీతంలో మంత్రముగ్ధులను చేసిన మోహినియాట్టం యుగళ నృత్య ప్రదర్శన



**పటాన్ చెరు, ఆగస్టు 3, (సిరి న్యూస్)**
హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని లలిత, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మోహినియాట్టం యుగళ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. నిష్ణాతులైన నర్తకులు నీమా నిఖిల్, వీణా ఉన్నికృష్ణన్ గీతం డాన్స్ స్టూడియోలో ఈ ప్రదర్శనతో ఆహూతులను అలరించారు. గీతం లోని నృత్య అధ్యాపకురాలైన మైథిలి మరట్ అనూప్ సీనియర్ శిష్యులైన ఈ ప్రదర్శకులు, ఆమె ప్రఖ్యాత బృందానికి ప్రాతినిధ్యం వహిస్తూ అనేక ప్రతిష్ఠాత్మక సాంస్కృతిక ఉత్సవాలతో పాటు జాతీయ వేదికలపై ప్రదర్శనలు ఇచ్చారు. ఇద్దరు నర్తకులు మోహినియాట్టంలో డిప్లొమాలు కలిగి ఉండగా, నీమా నిఖిల్ దూరదర్శన్ గ్రేడెడ్ కళాకారిణి కూడా. ఇది శాస్త్రీయ నృత్య సంప్రదాయంలో ఆమెకున్న ప్రావీణ్యాన్ని ప్రతింబిస్తుంది. లలితా సహస్రనామం నుంచి ఎంపిక చేసిన శ్లోకాల ఆధారంగా, కేరళ విశిష్టమైన భక్తి, నాటకీయ సంగీత సంప్రదాయమైన భావోద్వేగభరితమైన సోపాన సంగీతానికి అనుగుణంగా, మైథిలి మరట్ అనూప్ నృత్య దర్శకత్వం వహించిన హృద్యమైన దేవి స్తుతితో ఈ ప్రదర్శన ప్రారంభమైంది. మోహినియాట్టానికి నిర్వచనం ఇచ్చే సౌందర్యం, భక్తి, భావయుక్తమైన సొగసును ఈ ప్రదర్శన అద్భుతంగా ఆవిష్కరించింది. రెండవ ప్రదర్శనగా మహారాజా స్వాతి తిరునాల్ స్వరపరిచిన ఉత్సాహ భరితమైన పండుగ సంగీత రూపకం 'ఉత్సవప్రబంధం' ప్రదర్శించారు. భావ యుక్తమైన కథనం, సుందరమైన అభినయం ద్వారా, నృత్యకారులు ఒక అద్భుతమైన బంగారు తామర ఆకారపు రథంపై విచ్చేసిన దేవత ఎవరనే దానిపై ఒక ఊహాగానాల ఆటగా సాగే సరదా సంభాషణను ప్రదర్శించారు. ఆ దైవ స్వరూపం దేవతల రాజు అయిన ఇంద్రుడని ఒక నృత్యకారిణి సూచిస్తే, ఇంద్రునికి వెయ్యి కళ్ళు ఉండాలని మరొకరు ప్రతివాదన చేస్తారు. చంద్రునికి ఉండే మచ్చ లేకపోవడం వల్ల, ఆయన గుర్తింపు కూడా ప్రశ్నించేలా చంద్రుడితో సహా ఇతర దైవిక అవకాశాలతో ఈ సంభాషణ కొనసాగుతుంది. ఆసక్తికరమైన ఈ సంభాషణ చివరికి, ఆ దైవం సాక్షాత్తు పద్మనాభ స్వామి అని వెల్లడి కావడంతో ముగిసింది. దాని గేయ సౌందర్యం, నాటకీయ ఆకర్షణతో ఇది ప్రేక్షకులను ఆనంద పరిచింది. ఈ ప్రదర్శన ప్రఖ్యాత డాక్టర్ ఎం.బాలమురళీకృష్ణ స్వరపరిచిన ఉత్సాహభరితమైన 'థిల్లాన'తో ముగిసింది. లయబద్ధమైన వైభవాన్ని, సుందరమైన కదలికలను మేళవించిన తెలుగు సాహిత్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అధ్యాపక బృందం, విద్యార్థులు, కళాభిమానులు ఈ ప్రదర్శనను ఘనంగా ప్రశంసించారు. నృత్యకారుల సాంకేతిక నైపుణ్యం, భావవ్యక్తీకరణ, రంగస్థల ప్రదర్శన పట్ల వారికున్న అభిరుచిని అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, కళాత్మక నైపుణ్యాన్ని పెంపొందించడానికి, భారతదేశపు గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడానికి, నిష్ణాతులైన కళాకారులతో క్రమం తప్పని ప్రదర్శనలు, సంభాషణల ద్వారా గీతం హైదరాబాదు ప్రాంగణంలో ఉత్సాహభరితమైన సృజనాత్మక వాతావరణాన్ని సృష్టించడానికి లలిత, ప్రదర్శన కళల విభాగం చేస్తున్న నిరంతర ప్రయత్నాలలో ఇటువంటి కార్యక్రమాలు ఒక భాగమని పేర్కొన్నారు.

## రెండు నెలలు గడిచినా పురోగతి సాధించని జోగు సంగీత కేసు

- హత్యను సాధారణ మృతిగా చిత్రీకరించారనే ఆరోపణ
- బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం
- జోగు సంగీత కేసులో నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టాలి: నవోదయ సిద్ధార్థ




**నారాయణఖేడ్, ఆగస్టు 3 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జోగు సంగీత హత్య కేసులో నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టి నిందితులను చట్టప్రకారం కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్ నవోదయ సిద్ధార్థ డిమాండ్ చేశారు. ఆదివారం కంగ్టి మండలం దెగులువాడి గ్రామాన్ని సందర్శించిన ఆయన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, జోగు సంగీత హత్య జరిగినప్పటికీ కేసు నమోదులో పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శించారని, న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ప్రతిసారి తమను భయభ్రాంతులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం గ్రామంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన నవోదయ సిద్ధార్థ మాట్లాడుతూ..బాధిత కుటుంబం హైదరాబాద్‌లోని ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయడంతో వారి వినతిపై దెగులువాడికి వచ్చి పరిస్థితిని పరిశీలించినట్లు తెలిపారు.జోగు సంగీత భర్త జోగు విజయ్ మే 27న ఆమె కనిపించడం లేదని కంగ్టి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు వెంటనే స్పందించలేదని ఆయన ఆరోపించారు. అనంతరం మే 29న గ్రామ శివారులో జోగు సంగీత (26) మృతదేహం ఎడమ చేయి లేకుండా లభించిందని పేర్కొన్నారు. పోస్టుమార్టం నిర్వహించినప్పటికీ ఆ నివేదికను కుటుంబ సభ్యులకు ఎందుకు అందించలేదని ప్రశ్నించారు.రెండు నెలలు గడిచినా కేసులో గణనీయమైన పురోగతి లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని, బాధిత కుటుంబం న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్తే వారిని భయపెట్టడం బాధాకరమని విమర్శించారు. చట్టం అందరికీ సమానమని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు తమ సంస్థ తరఫున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసి, ముఖ్యమంత్రి దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.చివరగా జోగు సంగీత ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ గ్రామస్తులతో కలిసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం నవోదయ సిద్ధార్థ నేతృత్వంలోని బృందం కంగ్టి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై దుర్గారెడ్డిని కలిసి జోగు సంగీత కేసులో నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టి, నిందితులను వెంటనే అరెస్టు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ డాక్టర్ దిగ్గే బాబు, రాష్ట్ర నాయకులు డాక్టర్ ఓంప్రకాష్, కోర్ కమిటీ సభ్యులు ప్రభాకర్ , సంగారెడ్డి, మేడ్చల్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు గాల్‌రెడ్డి, డాక్టర్ బాబురావు, సాయిలు, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రధాన కార్యదర్శులు ఎం.ఏ. ఖైసర్, సంతోష్‌రావు పాటిల్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి బహుజన ప్రసాద్, సంస్థ నాయకులు సురేష్ గౌడ్, గ్రామస్తులు విశ్వనాథ్, శంకర్ , భీమప్ప ప్రకాష్ , బాధితులు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చెరుకు రైతుల సమస్య లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

**రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు**



**కోరుట్ల:ఆగస్టు 03 (తెలంగాణ వాణి)**
చెరుకు రైతుల సమస్యలు ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్తా, పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కోరుట్ల అసెంబ్లీ నియోజక వర్గంలో సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పట్టించారు. మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట నిజాం చక్కెర కర్మాగారం గత టిఆర్ఎస్ ప్రభుత్వం మూసి వేయబడి చెరకు రైతులు కామారెడ్డిలో ఉన్న ప్రైవేటు చెక్కెర ఫ్యాక్ట రీ తమ చెరుకు తరలించ డం వల్ల అదనంగా రూ. 400 భారం పడుతుందని చెరుకు రైతులు ఇబ్రహీంప ట్నం మండలంలో నిర్వహిం చిన సర్ పునఃశ్చరణ కార్య క్రమం లో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావును కలిసి తమ సమస్యలు తీసుకెళ్లగానే స్పందించిన జువ్వాడి కృష్ణా రావు చెరకు రైతుల సమస్య పరిష్కారం కోసం సంబందిత మంత్రుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ముత్యంపేటలో మూతపడ్డ చక్కెర కర్మగారాన్ని తిరిగి తెరిపించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు వెల్లడించారు.

## తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పించాలి

**అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**



**కరీంనగర్:ఆగస్టు 03 (తెలంగాణ వాణి)**
తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృత అవగాహన కల్పిం చాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ అన్నారు. ఈనెల 7 వరకు నిర్వహించ నున్న తల్లిపాల వారోత్సవా లకు సంబంధించిన పోస్టర్ ను అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరిం చారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడు తూ తల్లిపాల వారోత్సవా ల్లో భాగంగా గ్రామస్థాయిలో గర్భిణీలు బాలింతలు, కుటుంబ సభ్యులకు తల్లిపాల ఆవశ్యకతను వివరించాలని తెలిపారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని ప్రతి ఒక్కరికి తెలియజే యాలని,ముర్రుపాలలోని రోగనిరోధక శక్తి వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతాడని తెలిపారు.మహిళ,శిశు సంక్షేమ శాఖ సిబ్బంది ప్రభుత్వ,ప్రైవేటు ఆసుప త్రులను సందర్శించి అక్కడి గర్భిణీలు,బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యంపై కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు.పుట్టినప్పటి నుండి ఆరు నెలలు తప్ప నిసరిగా తల్లిపాలు ఇవ్వాల ని,రెండు సంవత్సరాల వరకు కొనసాగించాలనే విషయాన్ని తెలియజేయా లన్నారు.ముఖ్యంగా స్వయం సహాయక సభ్య లు,గ్రామ ప్రజాప్రతినిధుల సహకారంతో అవగాహన సమావేశ ఏర్పాటు చేసి తల్లిపాల ప్రాముఖ్యం వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఐసిడిఎస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నా

## మణుగూరు పీకే డీప్ సైడ్ ప్రాజెక్ట్ దక్కడం టీబీజీకేఎస్ పోరాట ఫలితమే

- ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ అసత్య ప్రచారాలు మానుకోవాలి
- టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ

**కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 3 (తెలంగాణ వాణి)**
మణుగూరు పీకే డీప్ సైడ్ ప్రాజెక్ట్ వేలంపాట ద్వారా సింగరేణికి దక్కడం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) పోరాట ఫలితమేనని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కుసాన వీరభద్రం అన్నారు. సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గుర్తింపు సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాల వల్లే మణుగూరు డీప్ సైడ్ ప్రాజెక్ట్ సింగరేణికి వచ్చిందని వారు చెబుతున్నారని, ఇలాంటి అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలకు చేతనైతే మిగతా బ్లాక్‌లను వేలంపాటలో కాకుండా, ప్రభుత్వంపై పోరాటం చేసి డైరెక్ట్‌గా సింగరేణి సంస్థకు కేటాయించే విధంగా చేయాలని డిమాండ్ చేశారు. వేలంపాట ద్వారా సింగరేణి దక్కించుకున్న మణుగూరు బ్లాక్‌ను తమ వల్లే వచ్చిందనడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని, వారు చేసే పనులను కార్మికులు గమనిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెప్తారని అన్నారు. ఇప్పటికైనా కార్మికుల శ్రేయస్సు కోసం పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో గడప రాజయ్య, తుమ్మ శ్రీను తదితరులు పాల్గొన్నారు.





## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

**అదన పు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి**

**కరీంనగర్:ఆగస్టు 03 (తెలంగాణ వాణి)**
ప్రజావా ణిలో అందిన ప్రతి దరఖా స్తును క్షేత్రస్థాయిలో పరిశీ లించి,నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సంబం ధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీవో షర్మిల,డీఆర్ఓ స్వామితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిం చారు.ఈ సందర్భంగా మొత్తం 212 దరఖాస్తులు అందగా అత్యధికంగా కరీంనగర్ ఆర్డీవో కార్యా లయానికి 66,గృహ నిర్మాణ శాఖకు 44 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులు, కోర్టు కేసులు అనవసరంగా పెండింగ్‌లో ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవా లని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించా రు.ప్రజలకు త్వరితగతిన న్యాయం జరిగేలా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవ హరించాలని సూచించారు.

## ఎల్ నినో పరిస్థితులపై రైతులకు అవగాహన



**శంకరపట్నం:ఆగస్టు 03 (తెలంగాణ వాణి)**
ప్రస్తుతం ఏర్పడిన ఎల్ నినో పరిస్థితు లపై మండల వ్యవసాయ అధికారి జి.వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం వ్యవసాయ విస్తరణ అధికారులు ఎరడపల్లి, ధర్మారం,అంబేద్కర్ నగర్, గుడాటి పల్లి గ్రామ సభ లలో రైతులకు ప్రత్యామ్నా య ఆరుతడి పంటలపై కల్పించారు.పసిఫిక్ మహాసముద్రం ఉపరిత లంపై ఏర్పడిన అధిక ఉష్ణోగ్రతలతో వాతావరణం లో ఎల్ నినో అనే పరిస్థితి ఏర్పడిందని,దీంతో వర్షాలు ఎప్పుడూ ఎక్కడ కురుస్తా యో తెలియని పరిస్థితి ఏర్పడింది.దానివల్ల ఉష్ణోగ్రతల తీవ్రత పెరిగి, నీటి వనరుల సమృద్ధి తగ్గిపోతుందని తెలిపారు. దీన్నిబట్టి ఉన్న నీటితో తక్కువ నీటి వినియోగం జరిగే ఆరుతడి పంటలను రైతులు పండించాలని వారికి అవగాహన కల్పిం చారు.ఈ కార్యక్రమాలలో ఏ ఈ ఓ లు - ఆరతి, సునంద, రాజ్ కుమార్, కీర్తన,గ్రామస్తులు,రైతులు పాల్గొన్నారు.




## మౌళి క్రైమ్ కామెడీకి ఇంట్రెస్టింగ్ టైటిల్

### వెరైటీ టైటిల్‌తో రాబోతున్న మైత్రీ మూవీ మేకర్స్..

ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ మరో ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల 'లిటిల్ హార్ట్స్' సినిమాతో విజయాన్ని అందుకున్న యువ నటుడు మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'దొంగ నా కొడకా' అనే వినూత్నమైన టైటిల్‌ను ఖరారు చేసినట్టు తెలుస్తుంది.. ఈ చిత్రానికి నూతన దర్శకుడు శ్రీను కంబాల దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ చివరి దశకు చేరుకున్న ఈ మూవీని క్రైమ్ కామెడీ జానర్‌లో తెరకెక్కిస్తున్నారు. వినోదంతో పాటు థ్రిల్లింగ్ అంశాలను కలగలిపిన కథతో ప్రేక్షకులను ఆకట్టుకునేలా దర్శకుడు శ్రీను కంబాల ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. కథలో వచ్చే ట్విస్టులు, కామెడీ ట్రాక్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ సినిమాకు సంబంధించిన టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కళాశాలలో ఘనంగా ఆవిష్కరించేందుకు మేకర్స్ సిద్ధమయ్యారు. యువతను ప్రధాన లక్ష్యంగా చేసుకుని ఈ ఈవెంట్‌ను నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. టైటిల్ ప్రకటించకముందే సినిమా గురించి ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చ జరుగుతుండగా, ఇప్పుడు 'దొంగ నా కొడకా' అనే టైటిల్ ప్రేక్షకుల్లో మరింత క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ చిత్రంలో సుష్మితా షెన్ కథానాయికగా నటిస్తోంది. హీరో–హీరోయిన్ల మధ్య వచ్చే వినోదభరితమైన సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని సమాచారం. సినిమాటోగ్రాఫర్ సూర్య బాలాజీ తన కెమెరాతో చిత్రానికి ప్రత్యేక విజువల్ టోన్ అందిస్తున్నట్లు తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువలకు తగ్గట్టుగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కథకు తగ్గట్టుగా నాణ్యమైన నిర్మాణ విలువలు, వినోదాత్మక స్క్రీన్‌ప్లే, విభిన్నమైన పాత్రలు సినిమాపై మంచి అంచనాలు పెంచుతున్నాయి. త్వరలోనే టైటిల్, ఫస్ట్‌లుక్ విడుదలతో పాటు సినిమా విడుదల తేదీ, టీజర్, ట్రైలర్ వంటి ఇతర వివరాలను కూడా చిత్ర బృందం ప్రకటించనుంది. వినూత్నమైన టైటిల్‌తో వస్తున్న 'దొంగ నా కొడకా' ప్రేక్షకులను ఏ స్థాయిలో అలరిస్తుందో చూడాలి.

## చిరంజీవి, నాగార్జునతో మల్టీస్టారర్.. అనిల్ ప్లాన్ అదుర్స్



మల్టీ స్టారర్ చిత్రాలకు తెలుగులో మంచి ఆదరణ ఉంటుంది. ఇద్దరు స్టార్ హీరోలు కలిసి నటిస్తే.. యావరేజ్ ఉన్నా సరే.. సినిమాను సూపర్ హిట్ చేస్తారు. అందుకే గతంలో ఎక్కువగా మల్టీస్టారర్ చిత్రాలు వచ్చేవి. ఈ మధ్య తెలుగు హీరోలంతా పాన్ ఇండియా సినిమాలపై ఫోకస్ పెట్టడం.. సోలోగా రాణించాలనే తపనతో మల్టీస్టారర్‌పై ఆసక్తి చూపించడం లేదు. అయితే స్టార్స్ కలిసి చేస్తే మాత్రం ఆ సినిమా చూడాలని ప్రేక్షకులు కోరుకుంటున్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి ఇప్పుడు అదే చేయబోతున్నాడు. టాలీవుడ్ సీనియర్ హీరోలు మెగాస్టార్ చిరంజీవి, నాగార్జునలతో క్రేజీ సినిమా తెరకెక్కించబోతున్నాడట. అనిల్ రావిపూడి సినిమాలు ఎలా ఉంటాయో తెలిసిందే. స్టార్స్‌తో కూడా కామెడీ చేయించి హిట్ కొడతాడు. ఇప్పటికే చిరంజీవి, వెంకటేష్, బాలకృష్ణలతో బ్లాక్ బస్టర్ హిట్స్ తీశాడు. ఇప్పుడు ఆయన ఫోకస్ నాగార్జునపై పడింది. నాగార్జునతో సినిమా చేస్తానని అనిల్ ఎప్పటి నుంచో చెబుతున్నాడు. త్వరతోనే ఈ ప్రాజెక్ట్‌ని పట్టాలపైకి ఎక్కించబోతున్నాడు. ప్రస్తుతం నాగార్జున తన 10వ సినిమాలో బిజీగా ఉన్నాడు. ఇది పూర్తయిన తర్వాత అనిల్‌తో సినిమా చేస్తాడని ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. అయితే తాజా సమాచారం ప్రకారం.. నాగార్జునతో సోలో సినిమా కాకుండా చిరంజీవిని కూడా కలిపి మల్టీస్టారర్ రూపొందించాలని అనిల్ ప్లాన్ చేస్తున్నాడట. ఇలా ఇద్దరూ కలిసి ఒకే సినిమాలో కనిపిస్తే అభిమానులకు అది నిజంగా పండగ అనే చెప్పొచ్చు. అంతేకాదు.. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా ఈ సినిమాపై భారీ క్రేజ్ ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## రామాయణంలో సీత పాత్ర వివాదం..

### సాయి పల్లవి పాత ఇంటర్వ్యూ వైరల్!

రామాయణంలో సీత పాత్రలో నటిస్తున్న సాయి పల్లవి ఎంపికపై సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్న సంగతి తెలిసిందే. సీత పాత్రకు సాయి పల్లవిని ఎలా తీసుకున్నారంటూ కొందరూ కామెంట్లు చేస్తుండగా.. ఈ చర్చల మధ్య సాయిపల్లవి గతంలో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూ నెట్టింట వైరల్ అవుతోంది. సాంప్రదాయ రూపురేఖల గురించి కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, ఆమె నటనకు, సహజ సౌందర్యానికి మరికొందరు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో తన చిన్ననాటి మొటిమల సమస్య, ఫెయిర్‌నెస్ క్రీమ్ యాడ్ తిరస్కరించడం గురించి సాయి పల్లవి గతంలో చెప్పిన ఆసక్తికర విషయాలు మళ్లీ చర్చనీయాంశమయ్యాయి. సినిమాల్లోకి రాకముందు తనకు ఉన్న మొటిమలు, రోసిషియా సమస్య కారణంగా ఎంతో ఆందోళన చెందానని సాయి పల్లవి గతంలో తెలిపారు. 'ప్రేమమ్' సినిమా విడుదలకు ముందు నేను ఎన్నో ఫెయిర్‌నెస్ క్రీమ్‌లు వాడాను. ముఖంపై మొటిమల వల్ల ఎంతో మానసిక వేదన అనుభవించాను. నలుగురిలోకి వెళ్లడానికి భయపడేదాన్ని. జనం నా కళ్లను కాకుండా నా మొటిమలనే చూస్తున్నారని బాధపడేదాన్ని అని ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే 'ప్రేమమ్' చిత్రంతో ప్రేక్షకులు తనను ఉన్నట్లుగానే ఆదరించడంతో తనలో ఆత్మవిశ్వాసం పెరిగిందని ఆమె చెప్పారు. సౌందర్య ప్రమాణాలు, రంగు వివక్షపై సాయి పల్లవి ఎప్పుడూ కఠినంగా వ్యవహరిస్తుంటారు. ఇందులో భాగంగానే రూ. 2 కోట్ల విలువైన ఫెయిర్‌నెస్ క్రీమ్ ఎండార్స్‌మెంట్ ఆఫర్‌ను ఆమె సున్నితంగా తిరస్కరించారు. సమాజంలో ఇటువంటి ప్రచారాలు యువత ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తాయని ఆమె భావించారు. సమాజంలో రంగు ఆధారంగా ఎంతోమందిని చిన్నచూపు చూస్తున్నారు. అలాంటి ప్రమాణాలను నేను ప్రమోట్ చేయలేను అని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె పాత వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతున్నాయి.

## 'ఎల్లమ్మ' అప్‌డేట్.. దేవి వింటేజ్ ఫస్ట్ లుక్




'బలగం' ఫేమ్ వేణు దర్శకత్వం వహిస్తున్న కొత్త సినిమా 'ఎల్లమ్మ'. ఎప్పటినుంచో సెట్స్ మీద ఉంది. ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఈ ప్రాజెక్టుతో హీరోగా పరిచయమవుతున్నాడు. కొన్నాళ్ల క్రితం గ్లింప్స్ లాంటి వీడియో రిలీజ్ చేశారు. తర్వాత నుంచి పూర్తిగా సైలెంట్ అయిపోయారు. మళ్లీ ఇన్నాళ్లకు మరో అప్‌డేట్ ఇచ్చేశారు. దేవిశ్రీ ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా 'ఎల్లమ్మ' ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఇందులో పార్సి అనే కుర్రాడిగా కనిపించబోతున్నాడు. క్లీన్ షేవ్ చేసిన లుక్‌లో దేవి డిఫరెంట్‌గా ఉన్నాడు. చెప్పాలంటే బయట కనిపించేదానికి సినిమాలో కనిపించే దానికి మొత్తానికి మార్చేసినట్లు తెలుస్తోంది. దిల్ రాజు ఈ చిత్రానికి నిర్మాత కాగా హీరోయిన్ ఎవరు? మిగతా నటీనటులు ఎవరనేది ఇంకా బయటపెట్టలేదు. రిలీజ్ ఎప్పుడనేది కూడా ప్రస్తుతానికి ఇంకా సస్పెన్స్.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com